


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం, సెప్టెంబరు 13, 2024

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-


# కామ్రేడ్ ఏచూరి కన్నుమూత

## ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ తుదిశ్వాస



సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖులు, రాజకీయ నేతల నివాళి

ప్రియతమ కామ్రేడ్‌ను కోల్పోవడం తీవ్ర విషాదకరమన్న సీపీఎం

నేటి సాయంత్రం వసంత్‌కుంజ్‌లోని నివాసానికి భౌతికకాయం

రేపు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పార్టీ ఆఫీసులో పార్థివ దేహం

వైద్య పరిశోధనల నిమిత్తం భౌతికకాయాన్ని ఎయిమ్స్‌కు అప్పగించనున్న కుటుంబం

న్యూఢిల్లీ: ఎర్రజెండా నీడలో ప్రకాశించిన అరుణతార నేల రాలింది. దశాబ్దాలుగా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతూ భారత కమ్యూనిస్టు రాజకీయాలపై చెరగని ముద్రవేసిన వామపక్ష యోధుడు, ప్రజా ఉద్యమకారుడు, సామాజిక వేత్త, కాలమిస్ట్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72) తుదిశ్వాస విడిచారు. న్యుమోనియాతో బాధపడుతూ ఆగస్టు 19వ తేదీన ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఐసీయూలో చేరిన ఏచూరి ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ తీవ్రమవడంతో రెండురోజుల క్రితం విదేశాల నుంచి మెడిసిన్ తెప్పించారు. అది కూడా ఫలితాన్నివ్వకపోవడంతో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సీతారాం ఏచూరి కన్నుమూసినట్లు ఎయిమ్స్ వైద్య బృందం ప్రకటించింది. ఆయన భౌతికకాయాన్ని ఎయిమ్స్‌కు పరిశోధనల నిమిత్తం దానంగా ఇవ్వనున్నారు. ఏచూరి కోరిక మేరకే ఆయన కుటుంబసభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏచూరి రెండు వివాహాలు చేసుకున్నారు. మొదటి భార్య పేరు ఇంద్రాణి మజుందార్. రెండో భార్య సీమ చిస్తీ. ఆయనకు కుమార్తె అఖిల, కుమారుడు డానిష్ ఉన్నారు. పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి,

(మిగతా 2వ పేజీలో)

### ప్రముఖుల సంతాపం

ఏచూరి మరణం తీవ్ర విషాదకరం. విద్యార్థి నేతగా మొదలై జాతీయ రాజకీయాల్లో కీలకంగా మారి పార్లమెంటేరియన్‌గా ఉంటూ ప్రజావాణిని వినిపించిన నేతను కోల్పోవడం విచారకరం. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడుతూనే అన్ని రాజకీయపార్టీల నేతలతో మైత్రి కొనసాగించారు. ఆయన కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా.

**- ముర్ము, రాష్ట్రపతి**

ఐదు దశాబ్దాల రాజుకీయ ప్రస్థానంలో దేశ ప్రజాస్వామ్యం పటిష్ఠుతకు ఏచూరి అవిశ్రాంతంగా కృషి చేశారు. ప్రజాసేవలో అలుపెరగక పనిచేశారు.

**- జగదీప్ ధన్‌కడ్, ఉప రాష్ట్రపతి**

వామపక్షాలకు ఏచూరి దారి దీపంగా మారారు. ప్రజా ఉద్యమాలను ముందుండి నడిపించారు. పార్టీలకతీతంగా అందరు నేతలతో కలిసిపోయే సామర్థ్యం ఆయన సొంతం. అలాంటి ఏచూరిని కోల్పోవడం విషాదకరం. పార్లమెంట్ సభ్యునిగా తనదైన ముద్ర వేశారు. ఈ విషాదకాలంలో ఆయన కుటుంబానికి మేమంతా అండగా నిలుస్తాం.

**-నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి**



# బీఆర్ఎస్‌లోనే గాంధీ.. ప్రతిపక్షానికే పీఏసీ: సీఎం రేవంత్

ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టీకరణ

నామినేషన్లన్నీ స్క్రూటినీ చేశాకే పీఏసీ పదవికి అరికెపూడి గాంధీ ఎంపిక

గతంలో అక్బరుద్దీన్‌కు పీఏసీ చైర్మన్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తే స్పీకర్ విచక్షణాధికారం అన్నదెవరు?

బతకడానికి వచ్చారంటూ చేసిన వ్యాఖ్యలపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్ సమాధానం చెప్పాలి

ఏ పార్టీ ఎమ్మెల్యేలు ఆ పార్టీలో ఉంటే తమకే మేలని వెల్లడి

న్యూఢిల్లీ: ప్రజా పద్దుల సంఘం (పీఏసీ) చైర్మన్‌గా ఎన్నికైన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ముమ్మాటికీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. నిబంధనలకు అనుగుణంగానే ప్రతిపక్షానికి పీఏసీ పదవి కట్టబెట్టామని తేల్చిచెప్పారు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి అడ్డగోలు నియామకాలు చేసింది బీఆర్ఎస్ కాదా అని విరుచుకుపడ్డారు. 'అసెంబ్లీ చివరి రోజు పార్టీ బలాబలాలను స్పీకర్ ప్రకటించారు. బీఆర్ఎస్‌కు 38 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని చెబితే ఆరోజు బీఆర్ఎస్ ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. మా సంఖ్య 38 కాదు.. 28 మాత్రమే అని వాళ్లు అనలేదు. అలాంటప్పుడు అనర్హత అనే అంశమే ఇక్కడ తలెత్తదు' అని స్పష్టం చేశారు. పార్టీ పరిస్థితులపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో చర్చించేందుకు ఢిల్లీకి వచ్చిన

(మిగతా 2వ పేజీలో)

# అరెకపూడి, కౌశిక్ రెడ్డి మధ్య, జెండా జగడం

## పార్టీ ఫిరాయింపులపై ఇద్దరి మధ్య మాటల యుద్ధం

గాంధీ ఇంటికెళ్లి బీఆర్ఎస్ జెండా ఎగరేస్తానన్న కౌశిక్.. ఆయన విల్లాకు వెళ్లిన గాంధీ, ఆయన అనుచరులు

టమాటాలు, కోడిగుడ్లతో దాడి, కిటికీలు, కుండీలు ధ్వంసం.. ప్రతిగా చెప్పులు విసిరిన బీఆర్ఎస్ కార్యకర్తలు


గంటన్నరపాటు హైటెన్షన్.. గాంధీ అరెస్టు, విడుదల.. సైబరాబాద్ కమిషనరేట్‌కు హరీశ్, కౌశిక్.. ఫిర్యాదు

గాంధీపై కేసు నమోదు చేయాలని బైఠాయింపు.. వారిని అరెస్టు చేసి కేశంపేట తీసుకెళ్లి వదిలిన పోలీసులు

ఇది ప్రభుత్వ దాడి.. పోలీసుల వైఫల్యం: హరీశ్‌రావు.. నేడు గాంధీ ఇంటిని ముట్టడిస్తాం: కౌశిక్

ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్న కౌశిక్: అరెకపూడి.. గాంధీ, అనుచరులపై కేసు నమోదు





# రెడ్డి ల్యాబ్స్ 5 కోట్లు, ఆంధ్ర షుగర్స్ 2 కోట్లు

### ::: సీఎం చంద్రబాబుకు చెక్కుల అందజేత

వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దాతలు భారీగా విరాళాలు అందిస్తున్నారు. పలువురు పారిశ్రామికవేత్తలు, సినీనటులు, రాజకీయ నాయకులు గురువారం అమరావతి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలసి విరాళాల చెక్కులు అందజేశారు. విరాళాలిచ్చిన దాతలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. రెడ్డి ల్యాబ్స్ ప్రతినిధి నారాయణరెడ్డి రూ.5 కోట్లు, ఆంధ్ర షుగర్స్ లిమిటెడ్ తరపున పెండ్యాల అచ్యుత రామయ్య రూ.2 కోట్లు, పర్చూరు నియోజకవర్గానికి చెందిన విక్రం నారాయణరావు కుటుంబం రూ.1,55,55,555, వసుధా ఫార్మా వెంకటరాజు రూ.కోటి, ఏపీ క్రెడాయ్ తరపున వైవీ రామారావు రూ.50 లక్షలు, వెంకట్ అక్కినేని రూ.50 లక్షలు, శివశక్తి బయోటెక్ చైర్మన్ నందిగామ శ్రీనివాసరావు,

(మిగతా 2వ పేజీలో)

# పిఠాపురంలో జగన్ పర్యటన



తాడేపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిఠాపురంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో వైఎస్ జగన్ పర్యటించనున్నారు. అక్కడ ప్రజలు, రైతులను వైఎస్ జగన్ కలువనున్నారు. కాగా, వైఎస్ జగన్ రేపు పిఠాపురంలో పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించనున్నారు. ఈ క్రమంలో మాధవరం, నాగులపల్లి, రమణక్కపేలో వరద బాధితులను పరామర్శించనున్నారు. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పిఠాపురంలో పంటలు నీటమునిగాయి. పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరుకున్న విషయం తెలిసిందే. ఆ ప్రాంతాలను వైఎస్ జగన్ పరిశీలించనున్నారు. వైఎస్ జగన్.. శుక్రవారం ఉదయం 9.15 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10.30 గంటలకు పిఠాపురం చేరుకుంటారు. అక్కడినుంచి బయలుదేరి పాత ఇసుకపల్లి మీదుగా మాధవపురం చేరుకుంటారు. అక్కడ వరద బాధితులతో మాట్లాడిన అనంతరం యూ.కొత్తపల్లి మండలం నాగులపల్లి చేరుకుంటారు. అనంతరం.. రమణక్కపేట వెళతారు. అక్కడ బాధితులని పరామర్శిస్తారు

# కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి కన్నుమూత

**జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన తెలుగు నేత**
**విద్యార్థి నేతగా రాజకీయ ప్రస్థానం ప్రారంభం...**
**సిపిఎం జాతీయ కార్యదర్శిగా మూడుసార్లు ఎన్నిక**
**ప్రజా సమస్యలపై నిరంతరాయంగా పోరాడిన**
**ఏచూరి మరణం భారత రాజకీయాలకు తీరని లోటు**





సీతారాం ఏచూరి మద్రాస్ లో తెలుగు కుటుంబంలో 12 ఆగస్టు 1952న జన్మించారు. ఆయన తండ్రి సర్వేశ్వర సోమయాజుల ఏచూరి ఆంధ్రప్రదేశ్ స్టేట్ రోడ్ కార్పొరేషన్‌లో ఇంజినీర్. తల్లి కల్పకం ఏచూరి ప్రభుత్వ అధికారి. వీరి మేనమామ మోహన్ కందా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఏచూరి బాల్యం హైదరాబాద్‌లోనే గడిచింది. ఇక్కడి ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. అనంతరం ఢిల్లీకి వెళ్లి ప్రెసిడెంట్స్ ఎస్టేట్ స్కూల్‌లో 1970లో సీబీఎస్‌సీ హయ్యర్ సెకండరీ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంకర్‌గా నిలిచారు. ప్రఖ్యాత సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఆర్థికశాస్త్రంలో బీఏ పూర్తి చేశారు. జేఎన్‌యూ నుంచి ఎంఏ పట్టా పొందారు. అక్కడే పీహెచ్‌డీలో చేరినా.. ఎమర్జెన్సీ సమయంలో అరెస్టు కావడంతో దాన్ని కొనసాగించలేకపోయారు. సీతారాం జర్నలిస్టు సీమా చిశ్తీని వివాహం చేసుకున్నారు. ఆయనకు ముగ్గురు సంతానం. విద్యార్థి నేతగా రాజకీయాల్లోకి.. ఎస్ఎఫ్ఐ విద్యార్థి నేతగా 1974లో సీతారాం ఏచూరి రాజకీయ ప్రస్థానం మొదలైంది. 1975లో జేఎన్‌యూ విద్యార్థిగా ఉన్నప్పుడు సీపీఐ(ఎం)లో చేరారు. జేఎన్‌యూ స్టూడెంట్స్ యూనియన్‌కు మూడుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరాత్‌తో కలిసి జేఎన్‌యూను వామపక్ష కోటగా మార్చారు. ఎస్ఎఫ్ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, జాతీయ అధ్యక్షుడిగా పనిచేశారు. 1984లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీలోకి వెళ్లిన ఆయన 1992లో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2005లో పశ్చిమ బెంగాల్ నుంచి తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2015లో విశాఖపట్నంలో జరిగిన 21వ సీపీఐ(ఎం) మహాసభల్లో పార్టీ ఐదో ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2018 హైదరాబాద్ మహాసభలోనూ, 2021 కోజికోడ్ మహాసభలోనూ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఆ పదవిలో కొనసాగుతున్నారు. ప్రజాసమస్యలపై గళం విప్పుతూ.. ప్రజాసమస్యలు, ఇతర అంశాలపై గళం విప్పుతూ.. ఎగువ సభలో సీతారాం ఏచూరి గుర్తింపు పొందారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం కోసం 'కామన్ మినిమమ్ ప్రోగ్రామ్' ముసాయిదాను రూపొందించడంలో మాజీ కేంద్ర మంత్రి పి.చిదంబరంతోపాటు ఏచూరి కీలక పాత్ర పోషించారు. 2004లో యూపీఏ సంకీర్ణ ప్రభుత్వ నిర్మాణంలోనూ ఏచూరిది ముఖ్య భూమిక. రచయితగానూ మంచి గుర్తింపు ఉంది. 'లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్' పేరిట ఓ ఆంగ్లపత్రికకు కాలమ్స్ రాశారు. 'క్యాస్ట్ అండ్ క్లాస్ ఇన్ ఇండియన్ పాలిటిక్స్ టుడే', 'సోషలిజం ఇన్ ఛేంజింగ్ వరల్డ్', 'మోదీ గవర్నమెంట్: న్యూ సర్జ్ ఆఫ్ కమ్యూనలిజం', 'కమ్యూనలిజం వర్సెస్ సెక్యులరిజం' వంటి పుస్తకాలు రాశారు. ఆ పార్టీ అధికారిక పత్రిక పీపుల్స్ డెమోక్రసీ పత్రికకు సుధీర్ఘకాలం సంపాదకులుగా పనిచేశారు.

## బీఆర్ఎస్‌లోనే గాంధీ.. ప్రతిపక్షానికే పీఏసీ: సీఎం రేవంత్

రేవంత్.. తన అధికార నివాసంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా అరికెపూడి గాంధీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి వివాదంతోపాటు పలు అంశాలపై స్పందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హయాంలో పీఏసీ ఎంపిక తీరును తప్పుపట్టారు. 'కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2018 నుంచి 2023 వరకు అక్బరుద్దీన్ ఒవైసీ పీఏసీ చైర్మన్ ఎలా ఉన్నారు. అప్పుడు సంఖ్యాబలం ఎక్కువగా ఉన్న కాంగ్రెస్‌కు పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వాలని అంటే... అది స్పీకర్ విచక్షణాధికారమని బీఆర్ఎస్ నేతలన్నారు. 2014లో టీడీపీకి 15 మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పుడు బీఏసీ సభ్యులుగా ఎర్రబెల్లి దయాకర్ రావు, రేవంత్‌రెడ్డి పేర్లు ఇస్తే... రేవంత్‌రెడ్డి పేరుకు ప్రత్యామ్నాయం సూచించాలని స్పీకర్ ఎందుకు అన్నారు? ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు నన్ను ఫ్లోర్ లీడర్‌గా గుర్తించాలని చెబితే ఎందుకు గుర్తించలేదు? 2014, 2018లో ఈ విధానాన్ని ప్రారంభించింది మీరే కదా' అని అన్నారు. పీఏసీలో 13 మంది సభ్యులుంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురికి, సీపీఐ, ఎంఐఎం, బీజేపీ నుంచి ఒక్కొక్కరికి అవకాశం ఇచ్చి కాంగ్రెస్ నుంచి నలుగురికి మాత్రమే అవకాశం ఇచ్చామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ సభ్యులు ఎన్నిక కోరలేదు కాబట్టే స్పీకర్ నామినేషన్‌లను పరిశీలించి గాంధీకి అవకాశం కల్పించారని తెలిపారు. కౌశిక్ వ్యాఖ్యలపై స్పందించిన రేవంత్‌రెడ్డి, 'బతకడానికి వచ్చి నోళ్లు అంటూ గాంధీని ఉద్దేశించి కౌశిక్‌రెడ్డి వాళ్ల బాస్ చెప్పిందే మాట్లాడారు. కౌశిక్ అలా మాట్లాడొచ్చా లేదా అనేది కేసీఆరే చెప్పాలి. కౌశిక్ వ్యాఖ్యలపై కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు సమాధానం చెప్పాలి' అని అన్నారు. బతకడానికి వచ్చిన వాళ్ల ఓట్లు కావాలి కానీ వాళ్లు వద్దా? అని నిలదీసిన ముఖ్యమంత్రి.. వాళ్లు ఓట్లేస్తేనే కదా గ్రేటర్‌లో గెలిచిందని గుర్తుచేశారు. 'బీఆర్ఎస్ పెద్దలు మాట్లాడమంటే కౌశిక్ మాట్లాడాడా, లేక ఆయన వ్యక్తిగత వ్యాఖ్యలా అనేది స్పష్టం చేయాలి. వీళ్లు మాట్లాడమంటే బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. కౌశిక్ వ్యక్తిగతంగా మాట్లాడితే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి' అని పేర్కొన్నారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి హైకోర్టు తీర్పును ప్రస్తావించగా, 'తీర్పును నేను అధ్యయనం చేయలేదు. అది చూస్తేనే దీనిపై మాట్లాడగలను' అని అన్నారు. ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ నేతలు అంటున్నారనగా.. 'బీఆర్ఎస్ నేతలు సైకలాజికల్ గేమ్ ఆడుతున్నారు. మా పార్టీకి 66 మంది ఎమ్మెల్యేలున్నారు. ఈ 66 మంది ఎమ్మెల్యేలు ఒళ్లు దగ్గర పెట్టుకుంటే ప్రభుత్వానికి ఇబ్బందులేం ఉండవు. ప్రభుత్వాన్ని పడగొడతామన్నందుకే ఈ సమస్యలన్నీ వచ్చాయి. ఈ చర్చలన్నీ బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రభుత్వాన్ని పడగొడతామని అన్నందుకే చర్చ జరుగుతోంది. ఆ రెండు పార్టీలు కలిసి ఈ ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి లేదని కోర్టు నుంచి ఆర్డర్ తీసుకొస్తే ప్రస్తుత ప్రభుత్వం మరింత పటిష్టంగా ఉన్నట్లే కదా. ఏ ఎమ్మెల్యే అయినా అటూఇటూ దిక్కులు చూస్తే అనర్హత వేటు పడుతుందంటే ఇక ప్రభుత్వానికి ఢోకా ఎక్కడుంది' అని అన్నారు. ఇదే అంశంపై మరింత స్పష్టతనిస్తూ 'కోర్టుకెళ్లి అనర్హతలపై ఆర్డర్ తెచ్చామంటున్నారు. బీఆర్ఎస్ నేతలు ఏ ఆర్డర్ తెచ్చినా.. ప్రభుత్వంలోని పార్టీకి అడ్వాంటేజ్ అవుతుంది. ప్రభుత్వంలో ఉన్న పార్టీ నుంచి ఎమ్మెల్యేలను లాక్కునే అవకాశమే లేదని చట్ట ప్రకారం నిర్ణయం వస్తే, ప్రతిపక్ష పార్టీలకన్నా, మా పార్టీ వాళ్లమే ఎక్కువ సంతోషిస్తాం. ఎమ్మెల్యేలు ఎక్కడివారక్కడే ఉండాలని బీఆర్ఎస్ వాళ్లంటున్నారు. మేమూ అదే కోరుకుంటున్నాం. ఎక్కడివారు అక్కడే ఉంటే నా 66 మంది నాతో ఉంటారు. కేసీఆర్ లక్కీ నంబర్ నా వద్దే ఉంది కదా' అని అన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని పడగొడతామని తిరిగేకంటే పథకాల అమలు గురించి ప్రశ్నిస్తే బాగుంటుందని సూచించారు.

## కామ్రేడ్ ఏచూరి కన్నుమూత

దివంగత బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళులర్పిస్తూ ఆగస్టు 22న చివరిసారిగా ఏచూరి ఒక వీడియో సందేశంలో కన్పించారు. 'అనారోగ్యం కారణంగా ఎయి మ్స్ నుంచే మాట్లాడాల్సి వస్తోంది. విప్లవ లాల్ సలామ్‌లు బుద్ధదేవ్ గారికి..' అని ఆ సందేశంలో ఏచూరి అన్నారు. ఏచూరి మరణంతో అటు కమ్యూనిస్టు పార్టీలోనూ, ఇటు కుటుంబసభ్యుల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రియతమ కామ్రే డ్‌ను కోల్పోవడం తీవ్ర విషాదకరమని సీపీఎం పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఏచూరి మృతిపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహులతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ప్రముఖులు, పార్టీలకు అతీతంగా రాజకీయ నేతలు తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఏచూరి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఢిల్లీ వసంత్‌కుంజ్‌లోని ఆయన నివాసానికి తరలించనున్నారు.

## రెడ్డి ల్యాబ్స్ 5 కోట్లు, ఆంధ్ర షుగర్స్ 2 కోట్లు

వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు రూ.50 లక్షలు, మైసూరు గణపతి సచ్చిదానంద ఆశ్రమం రూ.25 లక్షలు, కోనేరు విమలాదేవి రూ.25 లక్షలు, కోనేరు ప్రదీప్ రూ.25 లక్షలు, ఆర్కే ఇన్‌ఫ్రా కార్పొరేషన్ రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి రూ.20 లక్షలు, ఫ్రాంక్విన్ ఫార్ములేషన్స్ సాగి కృష్ణంరాజు రూ.15 లక్షలు, మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ద్వారా ది కాంట్రాక్ట్ క్యారేజీ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.15 లక్షలు, అన్నమయ్య జిల్లా టీడీపీ శ్రేణుల నుంచి తంబళ్లపల్లి ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి రూ.15 లక్షలు, సింహ మోటార్స్ రావెళ్ల సతీష్ రూ.10,00,116, బొబ్బా గోపాలకృష్ణ, పువ్వాడ సుధాకర్‌రావు, వాస్తవ్య ప్రమోటర్స్ అండ్ డెవలపర్స్ రూ.10 లక్షలు, వికాస్ పబ్లిక్ స్కూల్ రూ.5 లక్షలు, విశ్వం ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీ రష్ హెల్త్‌కేర్, కోగంటి వెంకటరామయ్య, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి ఐదేసి లక్షలు, వాసిరెడ్డి సుగుణకుమారి రూ.3 లక్షలుఅందజేశారు.

# మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బెలిదే రమేష్ గుప్తా

**110 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపు**









మేడ్చల్ జిల్లా ప్రతినిధి,వార్తా మిర్రర్,సెప్టెంబర్ 12:మేడ్చల్–మల్కాజ్ గిరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా బెలిదే రమేష్ గుప్తా భారీ మెజార్టీతో గెలుపొందారు.తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యాలయం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం జగదీర్ గుట్ట లో ఎన్నికలు నిర్వహించారు.ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగింది.రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు,జిల్లా కౌన్సిల్ సభ్యులు ఓటింగ్ లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.జిల్లా మహాసభలో ఉన్న 239 ఓట్లకు గాను 218 సభ్యులు ఓటింగ్ లో పాల్గొన్నారు. అధ్యక్ష బరిలో బెలిదే రమేష్ గుప్తా,రేబిల్లి శ్రీనివాస్ గుప్తా లు పోటీలో నిలిచారు.రేబల్లి శ్రీనివాస గుప్తా పై 110 ఓట్ల భారీ మెజార్టీతో కీసర గ్రామ నివాసి బెలిదే రమేష్ గుప్తా ఘనవిజయం సాధించారు.బెల్దే రమేష్ గుప్తకు 164 ఓట్లు,రేబల్లి శ్రీనివాస్ కు 54 ఓట్లు వచ్చాయి.తన గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.జిల్లాలోని ఆర్యవైశ్యుల అభ్యున్నతికి కృషి చేస్తానని అన్నారు.

# అరెకపూడి, కౌశిక్‌రెడ్డి మధ్య జెండా జగడం




హైదరాబాద్ : పార్టీ ఫిరాయింపుపై రచ్చ రచ్చ! ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం! ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంటికి పార్టీ మారిన మరో 'బీఆర్ఎస్' ఎమ్మెల్యే! అక్కడ హై టెన్షన్ వాతావరణం! ఆయన అరెస్టు.. విడుదల! సీనులోకి మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు! సైబరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయం వద్దా తీవ్ర ఉద్రిక్తత! అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులు! వెరసి.. ఫిరాయింపులు, 'జెండా వివాదం' ఎమ్మెల్యేల మధ్య తీవ్రస్థాయి లొల్లికి దారి తీసింది! శేరిలింగంపల్లి రణరంగంగా మారింది. ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా ఇటీవల శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించిన విషయం తెలిసిందే. అయితే, ప్రతిపక్ష ఎమ్మెల్యేకు ఇవ్వాల్సిన ఆ పదవిని బీఆర్ఎసకు రాజీనామా చేసి కొన్ని రోజుల కిందట కాంగ్రెసలో చేరిన గాంధీకి ఎలా ఇస్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బుధవారం తీవ్రంగా స్పందించారు. "పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం ఉంటే స్పీకర్ నిర్ణయానికి ముందే రాజీనామా చేయాలి. లేదంటే ఆ పది మందికి చీరలు, గాజులు కొరియర్ చేస్తా.. వేసుకొని తిరగండి" అని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెసలో చేరినట్లు అప్పట్లో స్వయంగా చెప్పిన గాంధీ ఇప్పుడు దేవుడి కండువా కప్పుకొన్నానని మాట మారుస్తున్నాడని, ఆయన తమ పార్టీ సభ్యుడే అయితే తెలంగాణ భవన్‌కు రావాలని డిమాండ్ చేశారు. లేకపోతే, గురువారం ఉదయం 11 గంటలకు ఆయన ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ కండువా కప్పుతానని, ఆయన ఇంటిపై పార్టీ జెండా ఎగురవేసి, తెలంగాణ భవన్‌కు తీసుకెళ్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో, ఉదయం ఏడు గంటలకే కౌశిక్ ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయనను హౌజ్ అరెస్ట్ చేశారు.

### గేటును విరగ్గొట్టి.. తలుపులు నెట్టి..

తన ఇంటికి వచ్చి జెండా ఎగరేస్తానని కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించడంపై గురువారం ఉదయం అరెకపూడి గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. తన ఇంటి ముందు కుర్చీ వేసుకుని కూర్చుని మీడియాతో మాట్లాడారు. రాయలేని పదజాలంతో కౌశిక్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. "నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని అసెంబ్లీలో స్పీకర్ ప్రకటించారు. కౌశిక్ రెడ్డిలాంటి కోవర్టులకు నా గురించి మాట్లాడే అర్హత లేదు. 11 గంటలకు నా ఇంటికి వచ్చి జెండా ఎగుర వేస్తానన్నాడు. రాకపోతే 12 గంటలకు నేనే నీ ఇంటికి వస్తా. పార్టీలో చేరి భ్రష్టు పట్టించింది కాక పాత ముఖ్యమంత్రిని నాశనం చేశావు. కాంగ్రెస్ నుంచి కొంతమందిని తీసుకొచ్చి బీఆర్ఎసలో జాయిన్ చేస్తానని చెప్పావు. ఓ దుర్మార్గుడు నా ఇంటిపై జెండా ఎగరవేస్తానని అంటే ఊరుకుంటానా!? నా ఇంటిపై జెండా ఎగుర వేస్తానంటే ఎగుర వేయించుకునేందుకు సిద్ధంగా లేము. చేతులు కట్టుకుని కూర్చోలేదు. నువ్వో.. నేనో తేల్చుకుందాం.. ధైర్యం ఉంటే రా..! లేకపోతే నేనే వస్తా" అని సవాల్ విసిరారు. ఇది బీఆర్ఎసకు, తనకు మధ్య యుద్ధం కాదని, కౌశిక్‌కు తనకు మధ్యనని స్పష్టం చేశారు. ఎన్నికల్లో తనను గెలిపించకపోతే చనిపోతానని బ్లాక్ మెయిల్ చేసి ఎమ్మెల్యేగా గెలిచిన కౌశిక్ రెడ్డిలాంటి కోవర్టులకు తన గురించి మాట్లాడే అర్హత లేదని మండిపడ్డారు. కేసీఆర్‌కే తాను సమాధానం చెబుతానని, కౌశిక్ వంటి ఇజ్జత్ లేని వాళ్లకు జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పది నిమిషాల్లో రాకపోతే తానే కౌశిక్ ఇంటికి వెళతానని అన్నారు. అన్నట్లుగానే మధ్యాహ్నం 12 గంటలకు 20 వాహనాల కాన్వాయ్‌లో తన అనుచరులతో కొండాపూర్‌లోని కొల్లా విల్లాసలో ఉంటున్న కౌశిక్ రెడ్డి ఇంటికి వెళ్లారు. దీంతో, కౌశిక్ ఇంటి వద్ద భద్రతను మరింత పెంచారు. మధ్యాహ్నం 12.30 గంటలలోపు కౌశిక్ రెడ్డి ఇంటికి గాంధీ, ఆయన అనుచరులు చేరుకున్నారు. పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఇరు వర్గాల మధ్య తోపులాటలు, వాగ్వాదాలు జరిగాయి. కొంతమంది గేటును విరగ్గొట్టి, ప్రవేశ ద్వారానికి చెందిన తలుపులను తెరిచేందుకు ప్రయత్నించారు. విల్లాస్ బయట ఉన్న పెద్ద గేటును బద్దలు కొట్టి గాంధీ అనుచరులు లోపలికి వెళ్లారు. కానీ, వారు కౌశిక్ రెడ్డి దగ్గరకు వెళ్లనీయకుండా పోలీసులు కట్టడి చేశారు. అదే సమయంలో కౌశిక్, ఆయన అనుచరులపై గాంధీ అనుచరులు కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారు. కొంతమంది రాళ్లతో ఆయన ఇంటి కిటికీ అద్దాలు, పూలకుండీలు పగులకొట్టారు. దీనికి ప్రతిగా బీఆర్ఎస్ కార్యకర్తలు, కౌశిక్ రెడ్డి అనుచరులు వారిపై చెప్పులు విసిరారు. సైబరాబాద్ పోలీసులు ఎట్టకేలకు గాంధీని అరెస్ట్ చేసి నార్సింగి పోలీసు స్టేషన్‌కుతీసుకెళ్లారు. ఆ తర్వాత స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు.

### కౌశిక్ వర్సెస్ పోలీసులు

కౌశిక్ రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని ఖండిస్తూ మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, కౌశిక్ రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌కు వెళ్లారు. తన ఇంటిపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలంటూ కౌశిక్ రెడ్డి సైబరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బెడ్‌రూం కిటికీ బద్దలు కొట్టి తనపై దాడికి యత్నం చేశారని ఆరోపించారు. దాడికి యత్నించిన గాంధీ, ఆయన అనుచరులపై హత్యాయత్నం, దోపిడీ వంటి కేసులు నమోదు చేయాలని కోరారు. ఆ సమయంలో ప్రేక్షక పాత్ర పోషించిన మాదాపూర్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్, గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. దీంతో, కౌశిక్ రెడ్డి, పోలీసుల నడుమ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అడ్డుకోబోయిన పోలీసులపైకి వేలెత్తి చూపిన కౌశిక్ రెడ్డి.. జాగ్రత్త అంటూ హెచ్చరించారు. వెంటనే కలగజేసుకున్న హరీశ్ రావు.. ఆయనను సముదాయించి పక్కకు పంపించారు. అనంతరం ఆయన పోలీసులతో మాట్లాడారు. గాంధీ అనుచరులపై హత్యాయత్నం కేసు పెట్టాలని, వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఐఆర్ కాపీ ఇచ్చే వరకు ఇక్కడే ఉంటామని తేల్చి చెప్పారు. రాత్రి ఏడు గంటల వరకూ అక్కడే బైఠాయించారు. దాంతో, తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారంటూ కేసు నమోదు చేసిన పోలీసులు హరీశ్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, వివేకానందతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.

### గాంధీ, అనుచరులపై కేసు నమోదు

కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి కేసులో గచ్చిబౌలి పోలీసులు ఎమ్మెల్యే గాంధీ, ఆయన అనుచరులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిలో గాంధీని ఎ–1గా పేర్కొన్నారు. గాంధీతోపాటు కార్పొరేటర్లు, కార్యకర్తలు 30 మందిపై కౌశిక్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నంబర్ 1392/2024 నమోదు చేశారు. 189, 191(2), 191(3). 61, 132, 329, 111, 324(4), 324(5), 351(2), ఆర్–డబ్ల్యూ 190 డీఎన్ఎస సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఎ2గా మియాపూర్ కార్పొరేటర్ శ్రీకాంత్, ఎ3గా బి.గౌతంగౌడ్, ఎ4 రాంపల్లి వెంకటేష్, ఎ5 జి.రాములు, ఎ6 నరేష్, ఎ7 శివ, ఎ8 రాధిక, ఎ9 మంజుల, ఎ10 చంద్రికగౌడ్, ఎ11 కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్, ఎ12 బి.వెంకటేష్ గౌడ్, ఎ13 అష్రఫ్, ఎ14 రఘునాథ్‌రెడ్డి, ఎ15 మోహన్ గౌడ్‌తోపాటు పలు వీడియోలు పరిశీలించి దాడిలో పాల్గొన్న పలువురిని గుర్తించి 30 మందిపై కేసు నమోదు చేశారు.. మారింది. ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా ఇటీవల శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించిన విషయం తెలిసిందే. అయితే, ప్రతిపక్ష ఎమ్మెల్యేకు ఇవ్వాల్సిన ఆ పదవిని బీఆర్ఎసకు రాజీనామా చేసి కొన్ని రోజుల కిందట కాంగ్రెసలో చేరిన గాంధీకి ఎలా ఇస్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు.





## నాగోల్ ప్రభుత్వ పాఠశాలలో 68.వ ఎస్ జి ఎఫ్ ఉప్పల్ జోనల్ లెవెల్ కబడ్డీ టోర్నమెంట్ క్రీడలు ప్రారంభం

### - ముఖ్య అతిథిగా తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్

నాగోల్ వార్త మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 12

నాగోల్ ప్రభుత్వ పాఠశాలలో 68.వ ఎస్.జి.ఎఫ్ ఉప్పల్ జోనల్ లెవెల్, కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం ఉపాధ్యక్షులు బద్దం ధనుంజయ్ గౌడ్ హాజరై కబడ్డీ పోటీలను టాస్ వేసి ప్రారంభించారు, క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో కలిసి కొద్దిసేపు మాట్లాడారు, అనంతరం సభ వేదికపై క్రీడలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ధనుంజయ్ గౌడ్ గారిని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయనీలు ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా బద్దం ధనుంజయ్ గౌడ్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయని అన్నారు, క్రీడలతో విద్యార్థులలో స్నేహభావం పెరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో నాగోల్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు నాగోల్ గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు

## తార్నాక భారత్ పెట్రోల్ బంక్ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ



సికింద్రాబాద్, వార్త మిర్రర్ సెప్టెంబర్ 12.... వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తార్నాకలోని భారత్ పెట్రోల్ బంక్ యజమాని సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిదానాల్లో కెల్ల అన్నదానం ఎంతో గొప్పద న్నారు. అందుకే ఈ సంవత్సరం వినాయక చవితి వేడుకలను పురష్కరించుకుని ఈ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించా మని యజమాని సత్యనారాయణ, మేనేజర్ వెంకటేశ్వర రావు పేర్కొన్నారు. ఇక నుంచి ప్రతి ఏటా ఇదే విధంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మెనేజర్ వెంకటేశ్వర్ రావు, బంక్ సిబ్బంది. పాల్గొన్నారు.



## గణేష్ ఉత్సవాల సందర్భంగా సంస్కృతి ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ

సికింద్రాబాద్, వార్త మిర్రర్ సెప్టెంబర్ 12....గణేష్ ఉత్సవాలా సందర్భంగా సంస్కృతి ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ ఘనంగా నిర్వహించడం జరిగింది. సుమారు 600 పైగా ప్రసాదన్ని స్వీకరిచారు. ప్రొఫెసర్ వద్దేపల్లి, సత్యనారాయణ, గౌరీశంకర్,శ్రీరామ రావు, వెంకట్ రమణ,సంతోష్ మినన్,నిరంజన్ రెడ్డి,శ్రీకాంత్,నవీన్ కుమార్, సుబ్రహ్మణ్యం, సతీష్, ప్రకాష్, రామకృష్ణ ,మురళీధర్ రెడ్డి ,ప్రభాకర్ రెడ్డి,సోమా శేఖర్,దిలీప్ కుమార్ ,లక్షమాన్, సతీష్, నాగేశ్వరయ్, తరుణ్, అకిలేష్, పండు, ఆదిత్య పాల్గొన్నారు.



## సంస్థాన్ నారాయణపూర్ శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయలో ఏకగ్రీవంగా ఎన్నుకున్న నూతన కార్యవర్గము.

### అధ్యక్షులుగా సూరపల్లి కుచేలు, ప్రధాన కార్యదర్శిగా గుర్రం వెంకటేష్

నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి.

సంస్థాన్ నారాయణ పూర్ మండల కేంద్రంలో శ్రీ మార్కండేశ్వర దేవాలయ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సురేపల్లి కుచేలు, ఉపాధ్యక్షులుగా చెరిపల్లి లక్ష్మయ్య, మిర్యాల రాజరత్నం, ప్రధాన కార్యదర్శిగా గుర్రం వెంకటేశం, కోశాధికారిగా ఎలె నరసింహా, సహాయ కార్యదర్శిగా చిలుకూరి శ్రీనివాస్,ప్రచార కార్యదర్శి లు గా మాకం శ్రీనివాస్,కర్నాటి నవీన్ లు కార్యవర్గ సభ్యులుగా,మాకం యాదగిరి,పున్న విజయ్,గంజి రాములు, దోర్నాల అంజయ్య, మాకం రామకృష్ణ, సూరేపల్లి రాములు, సురేపల్లి జవహర్, సింగం భాస్కర్, లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు సూరపల్లి కుచేల్ మాట్లాడుతూ మార్కండేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధికి తాను శక్తి మేరకు కృషి చేస్తాను అని అన్నారు. ఈ విషయాన్ని ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన గుర్రం వెంకటేశం ఒక ప్రకటనలో తెలియజేశారు.

## రాహుల్ గాంధీ హిందూ దేవతలపై చేసిన ౧ వ్యాఖ్యలను నిరసిస్తూ బిజెపి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దగ్ధం

సికింద్రాబాద్,వార్త మిర్రర్ సెప్టెంబర్ 12... కాంగ్రెస్ నేత ఎంపీ రాహుల్ గాంధీ హిందూ దేవతలపైన హిందుత్వం పైన అవమానించి అవహేళన చేసి అసభ్యకరమైన పదజాలం ఉపయోగించిన హిందూ ద్రోహి రాహుల్ గాంధీ నిజ స్వరూపాన్ని ప్రజలకు తెలియడానికి దిష్టి బొమ్మ దాహనం కార్యక్రమాన్ని సీతాఫల్మండి డివిజన్ అంబేద్కర్ చౌరస్తా నందు ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ నియోజకవర్గ కంటెస్టెంట్ ఎమ్మెల్యే జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, రాష్ట్ర నాయకులు వెంకటేష్ గౌడ్, పోచయ్య యాదవ్, ప్రభు గుప్తా,రాజేశ్వరి, డివిజన్ అధ్యక్షులు అంబాల రాజేశ్వరరావు, హనుమంతు ముదిరాజ్, రాము వర్మ, శ్రీధర్ రావు, మేకల కీర్తి హర్ష కిరణ్, సరోజా, అనూష, మంజుల, బిక్షపతి యాదవ్, ఆకుల సంపత్, రాజ్ కుమార్ నేత, సత్తురి రవీందర్,రాజేష్ ముదిరాజ్ ,శ్రీనివాస్, గోవర్ధన్,సింహాచలం బాబు,దేవుడు కుమార్,వనమాల శ్రీనివాస్, వనమాల కిరణ్, జమ్మికుంట వేణు, గణేష్ రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు డివిజన్ పార్టీ నాయకులు మోర్చా నాయకులు సెల్ నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి మాట్లాడుతూ హిందూ ద్రోహి రాహుల్ గాంధీ తన వైఖరి మార్చుకోవాలని హిందూ దేవతలను కించపరిస్తే మట్టి కరిచి పోతారని, తెలంగాణలో



అడుగు కూడా పెట్టనీయమని హెచ్చరించారు. చెట్టు పేరు చెప్పకొని కాయలు అమ్ముకునే విధంగా హిందూ దేశంలో ఉంటూ అమెరికా పోయి హిందుత్వాన్ని హిందూ దేవతలను తిట్టడం హీనమైన చర్యని వెంటనే జాతికి క్షమాపణ రాహుల్ గాంధీని డిమాండ్ చేస్తున్నాం. లేకుంటే రానున్న రోజులలో రాహుల్ గాంధీని రాష్ట్రంలో ఎక్కడ తీర్గనీయకుండా అడ్డుకుం టామని సారంగపాణి హెచ్చరించారు.

# పేకాట స్థావరం పై పోలీసుల దాడి

### 7గురు పేకాటరాయుల అరెస్ట్

### 8,700 రూపాయల నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం

మందమర్రి సెప్టెంబర్ 12: వార్త మిర్రర్ ప్రతినిధి

పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ నగర్ లో బోరిగం వెంకటేశ్వర్లు నివాసంలో కొంతమంది అక్రమంగా పేకాట ఆడుతున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు రామగుండం టాస్క్ ఫోర్స్ పోలీసులు, పట్టణ పోలీస్ సిబ్బంది దాడి చేసి,డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్న 7గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి ఐదు సెల్ ఫోన్లు, 8,700రూపాయల నగదును స్వాధీనం చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్, టాస్క్ ఫోర్స్ పోలీస్ సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పట్టణంలోని రాజీవ్ నగర్ లో బోరిగం వెంకటేశ్వర్లు నివాసంలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో అక్కడికి వెళ్లి,పేకాట ఆడుతున్న 7గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో ఇంటి యజమాని, పట్టణ వ్యాపారి బోరిగం వెంకటేశ్వర్లు, పట్టణ వ్యాపారులు రాచర్ల అనిల్ కుమార్, రాకం సంతోష్, సింగరేణి ఉద్యోగి కల్కోటి శంకర్, వ్యాపారులు రాచర్ల రవికుమార్, జక్కని సత్యం, ఈగ రవి కిరణ్, ఎర్రం రాజన్న లు కలరు. వీరి వద్ద నుండి 8700 రూపాయల నగదు ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని,



నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. పోలీసులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టడానికి, శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి ఉన్నారన్నారు. గ్రామాలలో, పట్టణాలలో, ఫాం హౌస్ లలో, ఇళ్లల్లో పేకాట, బహిరంగ ప్రదేశంలో జూదం, మరే ఇతర కార్యక్రమాలు ఎవరైనా నిర్వహించాడు తెలిస్తే లేదా ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పట్టణ ఎస్ఐ 8712656570, సిఐ 8712656569 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.



## నారాయణ కళాశాలలో అంగరంగ వైభవంగా గణనాధుని నిమజ్జనం

### ఆడి,పాడి సందడి చేసిన విద్యార్థులు

కాప్రా,వార్త మిర్రర్,సెప్టెంబర్ 12:ఈసీఐఎల్ లోని నారాయణ కళాశాలలో వినాయక చవితి సందర్భంగా కళాశాల యజమాన్యం ప్రతిష్టించిన గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత ఆరు రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన అనంతరం గురువారం నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై గణనాధునికి మేళ తాళాలు, భాజా భజంత్రీలతో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేసి అలరించారు. అనంతరం నారాయణ కళాశాల జిఎం కె. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దే ఉద్దేశంతో వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 5 గురుపూజోత్సవం సందర్భంగా టీచర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. అదే విధంగా గత ఆరు రోజులుగా గణనాధుని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులను కేవలం చదువుకే పరిమితం చేయకుండా అన్ని రంగాలలో తీర్చిదిద్దేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీఐఎల్ నారాయణ కళాశాల జీఎం కె. శ్రీనివాస్, ఏజీఎం శ్రీనివాస్ రెడ్డి, డీన్ పీకే శర్మ ప్రిన్సిపాల్ యానాల వేణు కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



## కామ్రేడ్ సీతారాం ఏచూరికి మిర్యాలగూడ సిపిఎం కమిటీ జోహార్లు

మిర్యాలగూడ, సెప్టెంబర్:-12 (వార్త మిర్రర్)సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మృతి పట్ల మిర్యాలగూడ సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు గురువారం సాయంత్రం స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ మాట్లాడుతూ బాల్యం దశ నుండే కమ్యూనిస్టు భావజాలంతో ముందుకు సాగారన్నారు జీవితాంతం కమ్యూనిస్టు ఉద్యమంలో పాలుపంచుకున్నారని చెప్పారు. రెండుసార్లు పార్లమెంటు సభ్యుడుగా ఉండి పేద ప్రజల సమస్యలపై పార్లమెంట్లో గలమెత్తిన నాయకుడు అన్నారు. ఇందిరా గాంధీ ప్రభుత్వం విధానాలను తీవ్రంగా వ్యతిరేకించిన కరుడుగట్టిన కమ్యూనిస్టు నాయకుడు సీతారాం ఏచూరి అని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కార్యకర్తలు కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జగదీష్ చంద్ర, సత్యనారాయణ రావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, డా. మల్లు గౌతమ్ రెడ్డి, భవాండ్ల పాండు, రాగిరెడ్డి మంగారెడ్డి, పరుశురాములు,శశిధర్ రెడ్డి, తిరుపతి రా%శీ%మ్మూర్తి,ఎండి అంజాద్, ఆయూబ్, గాదె పద్మ, గోవర్ధనా, కోడిరెక్క మల్లయ్య, పల్లా బిక్షం, నాగేందర్, అరుణ, మాధవరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, ఆకారపు రాములు, వజీర్, బాషా తదితరులు పాల్గొన్నారు.



## మిర్యాలగూడ డివిజన్లో రుణమాఫీ కానీ రైతుల వివరాల సర్వే 50% పూర్తి

### అసిస్టెంట్ డైరెక్టర్ దేవ్ సింగ్

మిర్యాలగూడ సెప్టెంబర్ 12:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ వ్యవసాయ శాఖ డివిజన్ లో ఋణ మాఫీ కానీ రైతులు వివరాల సర్వే 50 శాతం పూర్తి అయ్యిందని అసిస్టెంట్ డైరెక్టర్ బి.దేవ్ సింగ్ నాయక్ తెలిపారు. గురువారం మిర్యాలగూడ మండలం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దివిజన్ లో మాఫీ కానీ సుమారు 6,918 మంది రైతుల ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించడం జరుగుతున్నదని వాటిలో 3,661 ఇళ్లు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. మిర్యాలగూడ మండలం, పట్టణంలో ఋణ మాఫీ కానీ 2, 741మంది రైతులు కాగా 1,117, అడవిదేవులపల్లి మండలంలో 392 మందికి గాను 232 మంది, వేములపల్లి మండలంలో 1177 రైతులకు 897, దామరచర్ల మండలంలో 908 రైతులకు 397, మాడ్గులపల్లి మండలంలో 1,700 రైతులకు గాను 1,013 రైతుల సర్వే నిర్వహించి వారి కుటుంబ వివరాలు సేకరించి ఆప్ లోడ్ చేసినట్టు తెలిపారు.





## పంటలను పరిశీలించిన వ్యవసాయాదికారులు

మందమర్రి సెప్టెంబర్ 12: వార్త మిర్రర్ ప్రతినిధి

మండలంలోని అందుగులపేట గ్రామంలో గురువారం మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, వ్యవసాయ విస్తరణ అధికారులు కనకరాజు, ముత్యం తిరుపతి లు గ్రామ రైతులతో కలిసి పత్తి మిరప పంట చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పత్తిలో బ్యాక్టీరియా, ఆకుపచ్చ తెగులు, రసం పీల్చు పురుగు నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు. చేనులలో అధిక వర్షాలకు నీరు నిల్వకుండా కాలువలు ద్వారా తీసివేయాలన్నారు. అదేవిధంగా మిరప పంటలో పై ముడుత, కింది ముడుత నివారణకు రోగార్ లేదా డైఫెంతురాన వంటి మందులు వేప నూనెతో కలిపి పిచికారి చేసుకోవాలని, ఆంత్రాక్నోస్ ఆకుపచ్చ తెగులు నివారణకు అజాక్సిస్ట్రోబిన్ లేదా మంకోజెబ్ వంటి మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు హనుమంత రెడ్డి, ఆశిరెడ్డి, వెంకటరెడ్డి, మహేష్ లు పాల్గొన్నారు.



## మహిళా యూనివర్సిటీ కి చాకలి ఐలమ్మ పేరు..సీఎం రేవంత్ రెడ్డి పై హర్షం వ్యక్తం చేసిన... గోపాల్ రజక

కల్వకుర్తి సెప్టెంబర్ 12 వార్త మిర్రర్ ప్రతినిధి:– కోఠి లోని మహిళా వర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరును ప్రకటించడం పట్ల బ్లాక్ కాంగ్రెస్ బిసి సెల్ కల్వకుర్తి తాలూకా అధ్యక్షుడు గోపాల్ హర్షం వ్యక్తం చేశాడు.నేడు తెలంగాణలో ప్రజా ఉద్యమలకు చాకలి ఐలమ్మ ప్రేరణ ఇచ్చింది.మహిళా యూనివర్సిటీ కి ఐలమ్మ పేరు ప్రకటించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి రజక వృత్తిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఐలమ్మ కుటుంబ సభ్యులలో ఒకరైన చిట్యాల శ్వేత మనవరాలికి మహిళా కమిషన్ సభ్యురాలుగా ప్రకటించడం ఎంతో గర్వంగా ఉందని అని అన్నాడు.

## ఏచూరి జీవితం ప్రజలకే అంకితం



మందమర్రి సెప్టెంబర్ 12: వార్త మిర్రర్ ప్రతినిధి ఎంతో ఉన్నత చదువులు చదివి, విద్యార్థి దశ నుండే వామపక్ష విద్యార్థి ఉద్యమాలవైపు ఆకర్షించబడి, 5 దశాబ్దాల క్రితం సిపిఎం పార్టీలో చేరి, ప్రజాసేవకే ఏచూరి తన జీవితాన్ని అంకితం చేశారని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సబ్బని కృష్ణ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిపిఎం జాతీయ కార్యదర్శిగా మూడుసార్లు ఎన్నుకోబడి, దోపిడీ పాలకులకు వ్యతిరేకంగా సోషలిజం, కమ్యూనిజం రావాలని, ఎన్నో అలుపెరగని పోరాటాలు చేస్తూ, నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు ఏచూరి తన జీవితం ప్రజలకే అంకితం చేస్తూ పనిచేసిన మహోన్నత నాయకుడని కొనియాడారు. కమ్యూనిస్టు మేధావి, సైద్ధాంతిక వేత్త, పోరాటాల వెలుగు, ప్రజల మనిషి ఏచూరి మరణం పట్ల సంతాపం తెలుపుతూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## కోటి మహిళా యూనివర్సిటీ కి చాకలి ఐలమ్మ పేరును ప్రకటించడం హర్షనియం.

### -నారాయణపురం రజక వృత్తిదారుల సంఘం మండల కన్వీనర్ : రాచకొండ రమేష్ బాబు



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 12

కోఠి లోని మహిళా వర్సిటీకి వీరనారి చాకలి ఐలమ్మ పేరును ప్రకటించడం పట్ల సంస్థాన్ నారాయణపురం రజక వృత్తిదారుల సంఘం మండల కన్వీనర్ రాచకొండ రమేష్ బాబు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో ప్రజా ఉద్యమలకు చాకలి ఐలమ్మ ప్రేరణ ఇచ్చింది.మహిళా యూనివర్సిటీ కి ఐలమ్మ పేరు ప్రకటించడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి రజక వృత్తిదారులు సంఘం తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.ఐలమ్మ కుటుంబ సభ్యులలో ఒకరైన చిట్యాల శ్వేత మనవరాలికి మహిళా కమిషన్ సభ్యురాలుగా ప్రకటించడం ఎంతో గర్వంగా ఉందని అని అన్నాడు. రాచకొండ రమేష్ బాబు



## ఊర చెరువు భూమిని కాపాడాలి

మందమర్రి సెప్టెంబర్ 12: వార్త మిర్రర్ ప్రతినిధి

పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని మందమర్రి(వి) వెళ్లే దారిలో గల ఊర చెరువు అక్రమాలకు గురై, అక్రమ నిర్మాణాలు జరిగాయని, వెంటనే చెరువు ఎఫ్టిఎల్ గుర్తించి, హద్దులు ఏర్పాటు చేసి, అక్రమ నిర్మాణాలు తొలగించి, చెరువు భూమిని కాపాడాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) చెన్నూరు నియోజకవర్గ కన్వీనర్ ముల్కాల్ల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్లు నకు బిఎస్పీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, చెరువు భూమిని కాపాడని పక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు బోర్లకుంట రాజలింగు, పి శ్రీనివాస్, కే విశ్వనాథం లు పాల్గొన్నారు.



ఊర చెరువు భూమిని కాపాడాలి

మందమర్రి సెప్టెంబర్ 12: వార్త మిర్రర్ ప్రతినిధి

పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని మందమర్రి(వి) వెళ్లే దారిలో గల ఊర చెరువు అక్రమాలకు గురై, అక్రమ నిర్మాణాలు జరిగాయని, వెంటనే చెరువు ఎఫ్టిఎల్ గుర్తించి, హద్దులు ఏర్పాటు చేసి, అక్రమ నిర్మాణాలు తొలగించి, చెరువు భూమిని కాపాడాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) చెన్నూరు నియోజకవర్గ కన్వీనర్ ముల్కాల్ల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్లు నకు బిఎస్పీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, చెరువు భూమిని కాపాడని పక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు బోర్లకుంట రాజలింగు, పి శ్రీనివాస్, కే విశ్వనాథం లు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనానికి సహకారం అందించండి



మందమర్రి సెప్టెంబర్ 12: వార్త మిర్రర్ ప్రతినిధి

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించు వినాయక శోభయాత్ర, నిమజ్జనానికి ప్రతి ఒక్కరు సహకరించి, జయప్రదం చేయాలని మందమర్రి సీఐ కే శశిధర్ రెడ్డి, పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్, పట్టణ మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్లు, మండల తహశీల్దార్ సతీష్, ఎలక్ట్రికల్ ఏఈ ఎస్టి మల్లేశం, పురోహితులు గోవర్ధనగిరి అనంతచార్యులు, కృష్ణ చైతన్య ఆచార్యులు తెలిపారు. హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర దేవస్థానంలో పట్టణ పరిధిలోని అన్ని వినాయక మండపాల సభ్యులచే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిఐ కే శశిధర్ రెడ్డి, పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్ లు మాట్లాడుతూ, వినాయక నిమజ్జన మహోత్సవాన్ని సెప్టెంబర్ 16న సోమవారం నిర్వహించుకోవాలని సూచించారు. వినాయకుని శోభాయాత్రలో, నిమజ్జనంలో మద్యం సేవించి పాల్గొనవద్దని, నిమజ్జనానికి చిన్న పిల్లలను తోడుకొని వెళ్లొద్దని తెలిపారు. అదేవిధంగా రెచ్చగొట్టే విధంగా, కవ్వింపు చర్యలకు పాలపాడవద్దన్నారు. పట్టణ మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వినాయక మండపాల వద్ద ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించడం జరిగిందని తెలిపారు. మండపాల వద్ద నిర్వహించూ అన్న ప్రసాద వితరణకు సైతం మున్సిపల్ సిబ్బంది సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఇంకేమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వచ్చినట్లయితే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు వినాయక శోభాయాత్రలో రోడ్డుపై గల గుంతలతో ఇబ్బంది కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకురాగా, తాత్కాలికంగా మరమ్మతులు నిర్వహించి, గుంతలను పూడుస్తామన్నారు. ఎలక్ట్రికల్ ఏఈ ఎస్టి మల్లేశం మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వినాయక మండపాలకు ఉచితంగా విద్యుత్తును అందజేస్తుందని, మండలి నిర్వాహకులు విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. పురోహితులు గోవర్ధనగిరి అనంతాచార్యులు, కృష్ణ చైతన్య ఆచార్యులు మాట్లాడుతూ, వినాయక నవరాత్రి విశిష్టతను, ప్రాముఖ్యతను వివరిస్తూ, పండుగను భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. పట్టణ పరిధిలో 142 వినాయక మండపాలు ఏర్పాటు చేసి, అత్యంత వైభవంగా వినాయక నవరాత్రి మహోత్సవాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువులు మండలి నిర్వాహకులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, పురోహితులు నరసింహా చారి, అజయ్ చారి, వినాయక మండలి నిర్వాహకులు, పట్టణ పోలీస్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కార్మిక సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ కృషి




మందమర్రి సెప్టెంబర్ 12: వార్త మిర్రర్ ప్రతినిధి

సింగరేణి కార్మిక వర్గం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటియుసి)ని నమ్మి గురుతర బాధ్యతను అప్పగించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా, కార్మిక సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, యాజమాన్యంతో చర్చించి, కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఏఐటియుసి కృషి చేస్తుందని యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు భీమనాథుని సుదర్శన్ లు తెలిపారు. గురువారం ఏరియాలోని ఏరియా వర్క్ షాప్ లో వర్క్ షాప్ యూనియన్ పిట్ కార్యదర్శి సిహెచ్పి శర్మ ఆధ్వర్యంలో వారు వర్క్ షాప్ కార్మికులను కలిసి, కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, సుదర్శన్ లు మాట్లాడుతూ, సెప్టెంబర్ 9న హైదరాబాద్ లోని సిఎండి కార్యాలయంలో యూనియన్ గుర్తింపు హోదా పత్రాన్ని ఇవ్వడం తీసుకోవడం జరిగిందని తెలిపారు. తక్షణమే ఆర్థికపరమైనటువంటి అంశాలలో భాగంగా కార్మికులకు సింగరేణి లాభాల్లో నుండి 35 శాతం లాభాల వాటా ఇవ్వాలని కోరుతూ, ఒకటి ,రెండు రోజులలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరివి రాజ్ కుమార్ ల నేతృత్వంలో ఏఐటీయూసీ బృందం సింగరేణి సిఎండి ని కలిసి, సెప్టెంబర్ లోనే లాభాల వాటాతో పాటు దసరా అడ్వాన్స్ ఇవ్వాలని కోరడం జరుగుతుందన్నారు. అదేవిధంగా దీపావళి బోనస్ (పిఎల్ఆర్ బోనస్) కోల్ ఇండియా యాజమాన్యంతో చర్చించి, మెరుగైన బోనస్ ను సైతం సాధించడం జరుగుతుందన్నారు. మిగతా సమస్యలైనటువంటి పెర్క్ పై ఐటి మాఫీ, సొంతింటి కల సాకారం తదితర అంశాలను ఒక్కొక్కటిగా కార్పొరేట్ స్థాయి చర్చల్లో పెట్టి, పరిష్కరిస్తామని తెలిపారు. అదేవిధంగా ఏరియా స్థాయి సమస్యలను ఏరియా జనరల్ మేనేజర్ స్థాయి స్ట్రక్చర్ సమావేశాలలో పెట్టి, పరిష్కరిస్తామన్నారు. సింగరేణి కార్మిక వర్గం ఆందోళన పడవద్దని, ఎర్రజెండా యూనియన్ అయిన ఏఐటీయూసీ నిరంతరం కార్మిక పక్షాన ఉండి, పోరాడి, హక్కులు సాధిస్తామని తెలిపారు. అనంతరం వర్క్ షాప్ కార్మికులకు డ్రెస్ కోడ్ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా నాయకులు పెద్దపల్లి బానయ్య, టేకుమట్ల తిరుపతి, ఆంటోని దినేష్, పిట్, సేఫ్టీ కమిటీ నాయకులు మస్క భూమయ్య, కన్నం వేణు, ఈ రాజేశ్వర్ రావు, కొండ వెంకటేష్, కన్నెబోయిన రాజయ్య యాదవ్, సిద్ధం లక్ష్మణ్, బైరీ పోషాలు, పొన్నం శ్రీనివాస్, కే రమేష్, డ్రైవర్లు వైజయంత్, నరేష్, సురేష్, కిరణ్, రాయలింగు, కృష్ణ, రాం రెడ్డి, కుమారస్వామి లు పాల్గొన్నారు.



## పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం వహించవద్దు


మందమర్రి సెప్టెంబర్ 12: వార్త మిర్రర్ ప్రతినిధి మండలంలోని ప్రతి గ్రామం, వార్డులలో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహించవద్దని మండల ప్రత్యేక అధికారి, ఉద్యానవన శాఖ అధికారిని అనిత, మండల ఎంపీడీఓ ఎన్ రాజేశ్వర్ సూచించారు. గురువారం వారు మండలంలోని బొక్కల గుట్ట, పులిమడుగు, అందుగుల పేట గ్రామపంచాయతీలలో పర్యటించి, పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించి, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. పారిశుద్ధ పనుల్లో భాగంగా మొదలు మురికి కాలువలు పూడికాలు తీత పనులు నిర్వహించారు అదేవిధంగా ప్రజలకు వ్యక్తిగత పరిశుద్ధ గురించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ప్రత్యేక అధికారి అనిత, ఎంపీడీఓ ఎన్ రాజేశ్వర్ మాట్లాడుతూ, వర్షాకాలం విషజ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణలో ఎలాంటి అలసత్వం వహించవద్దని, పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా, దోమల కాటుకు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా మండలంలోని చిర్రకుంట గ్రామపంచాయతీలో మెడికల్ క్యాంపు నిర్వహించి, ఫీవర్ సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటింటికి వెళ్లి, గ్రామంలో జ్వర పీడిత బాధితుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఉచిత వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు విద్యాలత, సురేష్, వీరేందర్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



## ఆలూరు ప్రాథమిక పాఠశాల గణేశుని నిమజ్జనం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 12

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఆలూరు ప్రాథమిక పాఠశాల ఆవరణలో నెలకొల్పిన గణేశుని నిమజ్జనం.....పిల్లలు పెద్దలు భక్తిశ్రద్ధలతో గణనాథుని పూజించి గురు వారం రోజున నిమజ్జనం చేయడం జరిగింది....ఈ కార్యక్రమంలో ఓ పిల్లగా వెంకటి, ఫేం రౌడిహరిష్, మాజీ సర్పంచ్ మెక్కోండ రాంరెడ్డి, ఉపాధ్యాయులు సతీష్, సాయికృష్ణ, కవిత, శృతి, గౌతమి, నల్లాల శేకర్, సంజీవ్ పాల్గొన్నారు.



## వందే భారత్ రైలుకు మంచిర్యాలలో హాల్టింగ్ ఇవ్వాలి

మందమర్రి సెప్టెంబర్ 12: వార్త మిర్రర్ ప్రతినిధి

సికింద్రాబాద్–నాగపూర్ ల మధ్య సెప్టెంబర్ 15న ప్రారంభమయ్యే వందే భారత్ రైలుకు మంచిర్యాల రైల్వే స్టేషన్లో హాల్టింగ్ ఇవ్వాలని బిజెపి నేత, పెద్దపల్లి మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, బిజెపి జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ లు కోరారు. ఈ మేరకు గురువారం సికింద్రాబాద్ రైల్వే నిలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గతంలో సైతం త్వరలో ప్రారంభమయ్యే వందే భారత్ రైలు గురించి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వే బోర్డ్ చైర్మన్ లను కలిసి, మంచిర్యాల రైల్వే స్టేషన్ లో వందే భారత్ రైలును ఆపాలని వినతిపత్రం అందజేయడం జరిగిందని గుర్తు చేశారు. రైల్వే శాఖ ఇటీవల విడుదల చేసిన హాల్టింగ్ జాబితాలో ఉమ్మడి అదిలాబాద్ జిల్లా నుండి ఒక్క రైల్వే స్టేషన్ లో హాల్టింగ్ లేదని తెలిపారు. రైల్వేకు అత్యధిక ఆదాయం ఇస్తున్న మంచిర్యాల రైల్వే స్టేషన్లో వందే భారత్ రైలును నిలపాలని కోరారు. మంచిర్యాల నుండి వ్యాపార నిమిత్తం అత్యధిక వ్యాపారస్తులు నాగపూర్, హైదరాబాద్ కు ప్రయాణం చేస్తూ ఉంటారని, తప్పనిసరిగా మంచిర్యాలలో వందే భారత్ రైలును నిలపాలని కోరారు.



## హుండీ లెక్కింపు సేవలో పాల్గొన్న భక్తులు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 12

రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామానికి చెందిన శ్రీరామ సేవా సమితి సభ్యులు గోనె రాములు ఆద్వర్యంలో 12 మంది మహిళా భక్తులు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో జరిగిన పరకమణి(హుండీ లెక్కింపు) సేవలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో రాములు, రమేష్ మహేష్ మహిళా భక్తులు ఉన్నారు.

## సింగరేణిలో ఐటిఐ అప్రెంటిస్ షిప్ కొరకు దరఖాస్తు చేసుకోండి

మందమర్రి సెప్టెంబర్ 12: వార్త మిర్రర్ ప్రతినిధి

సింగరేణి ఆధ్వర్యంలో 2024–25 విద్య సంవత్సరానికి వివిధ ట్రేడ్ లలో ఐటిఐ (ఎన్సివిటి) అభ్యర్థులు అప్రెంటిస్ షిప్ శిక్షణ కొరకు ఆసక్తిగల, అర్హులైన అభ్యర్థులు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఏరియాలోని ఎంవిటిసి లో దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభ్యర్థులు మొదటగా ప్రభుత్వ వెబ్ పోర్టల్ అప్రెంటిస్ షిప్ ఇండియా లో తమ పేర్లు నమోదు చేసుకున్న తర్వాత సింగరేణి వెబ్ పోర్టల్ లో ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాత వెబ్ పోర్టల్ అప్రెంటిస్ షిప్ లో ఇప్పటికే పేర్లు నమోదు చేసుకున్న అభ్యర్థులు ఎన్ఏపిఎస్ కొత్త వెబ్ పోర్టల్ అప్రెంటిస్ షిప్ ఇండియా కి మైగ్రేట్ చేయాలని మైగ్రేషన్ విధానం ఎంవిటీసీలో ప్రదర్శింపబడుతుంది, అదేవిధంగా సింగరేణి వెబ్ పోర్టల్ లో సైతం ఉంచబడుతుందని తెలిపారు. సింగరేణి వెబ్ పోర్టల్ సెప్టెంబర్ 7 నుండి 23 వరకు తెరిచి ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను సెప్టెంబర్ 9 నుండి పోర్టల్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఉత్తర్వుల యొక్క పోర్టల్, ఉత్తర్వులు, అనుబంధం–ఏ లో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం సెప్టెంబర్ 10 నుండి ఏరియా ఎంవిటిసి వద్ద హార్డ్ కాపీని సమర్పించాలన్నారు.



# బీఎస్పీ కార్యకర్త పోలే రమాశంకర్ రోడ్డు ప్రమాదంలో మృతి

## - మానవత్వం చాటుకున్న చండూరు మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న,10,000 ఆర్థిక సహాయం

నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి....

చండూరు మున్సిపల్ పరిధిలోని పుల్లెంల గ్రామానికి చెందిన బి ఎస్ పి కార్యకర్త పోలే రమాశంకర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న చండూరు మున్సిపల్ చైర్ పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న పుల్లెంల గ్రామానికి చేరుకొని మృతుని కుటుంబానికి 10,000 రూపాయల ఆర్థిక సహాయం చేసి మృతునికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ చైర్మన్ బొబ్బిలి శ్రీనివాస్ రెడ్డి, టిఆర్ఎస్ మండల నాయకులు బొడ్డు సతీష్, గోపిడి వెంకటరెడ్డి, పాలకూరి రాములు, పోలే లోకేష్, గంటా రాములు, ఇరిగి యాదయ్య, కంబాలపల్లి వెంకన్న, మాజీ ఎంపీటీసీ సీతయ్య యాదయ్య, మాజీ సర్పంచ్ బొడ్డు వెంకన్న, కూరపాటి సుదర్శన్, ఇరిగి గురునాథ్, నల్లగంటి రమేష్, ఇరిగి హరికాంత్, రంగయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు



# మట్టి గణపతే మహా గణపతి కులవృత్తి ఉట్టిపడేలా మండప ఆలంకరణ

## అన్నదానం ప్రత్యేక పూజలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 12

రాయికల్ పట్టణంలోని మహేంద్ర మ్యాదరి యువజన యూత్ ఆధ్వర్యంలో మట్టి గణపతి ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండపాన్ని మ్యాదరి కులవృత్తి ఉట్టి పడేలా గంపలతో అలంకరించిన విద్యుత్ దీపాల అలంకరణ అహుతులను అలరించింది. అన్నదాన కార్యక్రమంనిర్వహించి ప్రత్యేక పూజ కార్యక్రమాలకు ఏడవ వార్డు కౌన్సిలర్ లతిక – అనిల్ హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకై మట్టి వినాయక విగ్రహమును ప్రతిష్టించి పూజించడం అభినందనీయం అని కొనియాడారు. ఇట్టి కార్యక్రమంలో మ్యాదరి సంఘం పెద్దమనుషులు, సంఘ సభ్యులు, యూత్ నాయకులు ఊరేడి రాజు, ఇందురి రంజిత్, కొన రాజు, కోన వికాస్ , ఊరేడి రాజేష్, ఊరేడి రఘు, ఊరేడి యశ్వంత్, శేర్ల శివ, శేర్ల శ్రీకాంత్, ఊరేడి సాయి కుమార్, మదిరే నవీన్, మదిరె భరత్, చిలివేరి రాజు, చిలివెరి అరవింద్, చిలివెరి అరుణ్, సిలివేరి మణితేజ,మాదిరే సాగర్, ఇందు మహేష్, ఏనుగందుల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ.

వార్త మిర్రర్ మేడిపల్లి ప్రతినిధి సెప్టెంబర్12:జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని కట్లకుంట గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సహకారంతో మేడిపల్లి మండల జెడ్పిటిసి హరిచరణ్ రావు ఆధ్వర్యంలో కట్లకుంట గ్రామానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైనచెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు మూతి పెల్లి చిన్న భూమయ్య, కె డి సి సి బ్యాంక్ డైరెక్టర్ మిట్టపల్లి రమేష్ రెడ్డి, తాజా మాజీ ఎంపీటీసీ పొన్నం లావణ్య– రాజేశ్వర్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ నెంబర్ షేక్ అహ్మద్,గ్రామ శాఖ యూత్ అధ్యక్షుడు అశోక్ రాజు,ఉపాధ్యక్షుడు మూగుల నరేందర్, సీనియర్ నాయకులు శ్రీరాములసురేష్,బడాల లింబాద్రి,కొప్పుల భూమయ్య, మాజీ వార్డ్ నెంబర్ బక్క శెట్టి రాజిరెడ్డి, రొండి నరేష్, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 12

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు జగిత్యాల పట్టణంలోని స్థానిక తాహసిల్ చౌరస్తా వద్ద దేశంలో మతకల్లోహాలు విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా విద్వేషపూరిత వాక్యలు చేసిన కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం, నిరసన కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షులు పైడిపల్లి సత్యనారాయణ రావు తో కలిసి పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా.బోగ శ్రావణిఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రగిల్లా సత్యనారాయణ, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు రెంటం జగదీష్, మండల అధ్యక్షులు నలువాల తిరుపతి, రాంరెడ్డి, ధర్మపురి, నర్సయ్య, జిల్లా కోశాధికారి దశరథ్ రెడ్డి, బొడ్డు పెద్ద గంగన్న, ఇట్నేని రమేష్, బద్దల గంగరాజు, ఆముద రాజు, దివాకర్, ఆకుల మహేష్, జిల్లా మండల పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏచూరి సీతారాం మరణం కమ్యూనిస్టులకు తీరని లోటు

## నల్లగొండ సిపిఎం పట్టణ కార్యదర్శి ఎండి సలీం

నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి...సిపిఎం అఖిలభారత కార్యదర్శి సీతారామ్ ఏచూరి మరణం కమ్యూనిస్టులకు తీరని లోటు అని సిపిఎం పట్టణ కార్యదర్శి ఎండి సలీం అన్నారు.గురువారం సుందరయ్య భవన్లో సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం అఖిలభారత కార్యదర్శి, ఉత్తమ పార్లమెంటేరియన్, కామ్రేడ్ సీతారామ్ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ వారి మరణం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని అన్నారు. వారు ఉత్తమ పార్లమెంటేరియన్ గా పేద ప్రజల హక్కుల కోసం అనేక ఉద్యమాలను రూపొందించిన మహా మేధావి అని కొనియాడారు. ప్రపంచ కమ్యూనిస్టులంతా ఏకం కావాలని సంకల్పంతో అనేక దేశాలతో సత్సంబంధాలు కలిగి ఏకతాటికి తీసుకొచ్చి ప్రపంచ కమ్యూనిస్టు మహాసభలను నిర్వహించిన నాయకుడని కొనియాడారు. వారితో నల్గొండ పట్టణానికి ఎంతో అనుబంధం ఉందని అనేక సభలు ఎన్నికలు సందర్భంగా వచ్చినప్పుడు తెలంగాణ సాయుధ పోరాట చరిత్ర కలిగిన నల్లగొండ లో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని ప్రోత్సహించే వారిని అన్నారు. వారి కుటుంబ సభ్యులకు




ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అనంతుల శంకరయ్య ,సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు కుంభం కృష్ణారెడ్డి, దండంపల్లి సరోజ, గాదే నరసింహ ,భూతం అరుణ, చలివోజు సైదాచారి, నరేష్, సాజిద్ అలీ, మన్నె శంకర్, కోట సైదులు, రాము, కునుకుంట్ల ఉమారాణి, విష్ణుమూర్తి, శ్రీరంగం తదితరులు పాల్గొన్నారు

# కార్మికులపై శ్రమ దోపిడీని అరికట్టాలి కార్మిక శాఖల అధికారులకు ఫిర్యాదు.

## బీడి సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి సుతారి రాములు

కోరుట్ల వార్త మిర్రర్ ప్రతినిధి, సెప్టెంబర్ 12.

బీడీ యజమాన్యులు కార్మికుల శ్రమ దోపిడిని అరికట్టాలని ప్రభుత్వ కార్మిక శాఖ అధికారులకు బీడి కార్మిక సంఘం ఫిర్యాదు చేశారు దేశాయి బీడీ బ్రదర్స్ లిమిటెడ్ బీడీ ఫ్యాక్టరీ కోరుట్ల రేంజ్ పరిధిలో కోరుట్ల రాయికల్ మన్నెగూడెం తాండ్రియాల మెడిపల్లి సెంటర్లుముఖ్య కేంద్రాలు ఉన్నాయని వివిధ గ్రామాలలో 300 బ్రాంచ్లలో 12 వేల మంది నిరక్షరాస్యులు అయిన మహిళా బీడీ కార్మికులు వీటిని చుట్టూ తూ కుటుంబ పోషణ గడుపుతున్నారని పేర్కొన్నారు వీరి సెంటర్ల పరిధిలోని గోడౌన్లు నుండి సరఫరా చేస్తున్న నాసారికమైన దొడ్డు నలుపు గజ్జర పలుగు ముక్కుడు తదితర రకాలుగా పోలి ఉండటం వలనవేయి బీడీలకు సరిపడా తునికి ఆకు తూకం వేస్తే500 బీడీలకు కై సరిపోవటం వల్ల మిగతా 500 తొలిక కొనుగోలు చేసి భర్తీ నింపడం మూలంగా అసలుకూలి డబ్బులు నష్టపోతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు ఆకు సప్లై చేసే గోడౌన్లపై తనిఖీలు చేసి నాసరికంని తునికాకును సీల్ చేయాలన్నారు ప్రస్తుతం కంపెనీలో నిలువ ఉన్న తుని కాకును కత్తిరించి కటింగ్ చేసి యావరేజ్ పెంచాలని దేశాయ్ బీడీ కంపెనీ నుండి తయారుచేసిన వివిధ రకాల చిక్స్ ప్యాకెట్లు స్వీట్లు డబ్బాలను బీడీ కార్మికులకు బలవంతంగా అంటగడుతూ కూలి డబ్బులు నుండి బీడీ మేనేజ్మెంట్ దండుకుంటుంది అని అన్నారుఈ తినుబండరాలను నిలిపివేసి పిల్లల ఆరోగ్యం కాపాడాలన్నారు బీడీ టేకెదారుల వద్ద వారి చెల్లించే22 రూపాయలు కమిషన్ నుండి




9 రూపాయలు బీడీ యజమాన్యం కోత . ఈ విధానం వలన బీడీ కార్మికులపై పరోక్షంగా బీడీలు ఎక్కువ మొత్తం కోత విధించడంతో కార్మికుల నష్టపోతున్నారు వెంటనే ఈ విధమైన వంటి శ్రమ దోపిడి అని అరికట్టాలన్నారు ఈ విషయంపై లేబర్ అధికారులు చట్టరీత చర్యలు తీసుకోవాలన్నారు లేనియెడల కార్మికుల చేత తీవ్రమైన ఆందోళనలు నిరసనలు ధర్నాలు చేపడుతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో వీడి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత ఎండి మౌలానా ముక్కురం ఉస్మాన్ ఎన్నం రాధాలు పాల్గొన్నారు



# అడ్డగుడ్డూరు మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు

వార్తా మిర్రర్ సెప్టెంబర్ 12 సూర్యా పేటజిల్లా సభ్యత్వ సహా ప్రముఖ్ కూరాకుల వెంకటేశ్వర్ రావు మండల పార్టీ అధ్యక్షులు ననుబోతు సైదులు కి సభ్యత్వం అందజేశారు సెప్టెంబర్ 2 భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభమైన సభ్యత కార్యక్రమం జిల్లాలో మరి మండలంలో కూడా ప్రారంభించడం జరిగింది గతంలోని ప్రపంచంలోని అతిపెద్ద పార్టీగా అవతరించిన భారతీయ జనతా పార్టీ ఇప్పటికే తెలంగాణలో అన్ని రాష్ట్రాల కంటే ముందు అందులో ఉంది సభ్యత్వంలో అన్నారు 8800 00 2024 నెంబర్ కు మిస్ కాల్ ఇచ్చి పార్టీ అభిమానులు సానుభూతిపరులు ఈ దేశం కోసం ధర్మం కోసం ఈ దేశ అభివృద్ధి కోసం అందరూ భారతీయ జనతా పార్టీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు తెలంగాణ లో సాదా రణ ఎన్నికల్లో 77 లక్షల ఓట్లు వేసి 36%తో రెండవ స్థానంలో%దీయజూ% ఉంది బూతు కు 200 సభ్యత్వాల చొప్పున రాష్ట్ర లో 50 లక్షల మందిని సభ్యులుగా నమోదు చేసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీగా మారడం ఖాయం అన్నారు ఈ కార్యక్రమంలో మండల సభ్యత్వ కన్వీనర్ దేశ బోయిన నాగరాజు మండల పార్టీ ఉపాధ్యక్షులు మరాటి కుమారస్వామి కొత్తోజు నవీన్ లింగాల నరసింహ మండల కార్యదర్శి నిమ్మల యాదగిరి కుమార్ జిల్లా మాజీ కార్యదర్శి లింగాల శ్యాంసుందర్ రెడ్డి మండల మాజీ అధ్యక్షులు మేకలు ఇమాన్యుల్ కిసాన్ మోర్చా అధ్యక్షులు ఏనుగు బీరుమల్లు అజింపేట్ బూత్ అధ్యక్షులు ఈశ్వర్ గౌడ్ అడ్డగూడూరు బూత్ అధ్యక్షులు కృష్ణారెడ్డి రాములు చీపిరి యాదిగిరి మొదలైన వారు పాల్గొన్నారు



# తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలి

## సీపీఐ నాయకులు గోదా శ్రీరాములు,నెల్లికంటి సత్యం.

సంస్థాన్ నారాయణపూర్ సెప్టెంబర్ 12 :( వార్త మిర్రర్ )తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాలు చేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు సిపిఐ మునుగోడు నియోజకవర్గం ఇంచార్జ్ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో అమరవీరుల స్తూపానికి పూలమాలవేసి నివాళులర్పించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో లభించదగ్గ పోరాటం ఏదైనా ఉందంటే అది సాయుధ రైతాంగ పోరాట చరిత్ర అని చెప్పాలన్నారు, భూమి కోసం భుక్తి కోసం పెట్టి చాకిరి విముక్తి కోసం పోరాటంలో ఎన్నో ప్రాణాలను అర్పించిన చరిత్ర కమ్యూనిస్టులకి దక్కిందన్నారు, సాయుధ పోరాటాన్ని హిందూ ముస్లిం మధ్య జరిగిన పోరాటంగా అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు,ఆ పార్టీ ఎన్నడూ కూడా స్వాతంత్ర పోరాటంలో సాయుధ పోరాటంలో మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రభుత్వమే. దానిని ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో బచ్చన గోని గాలయ్య యాదవ్, కురుమిద్దె శ్రీనివాస్,దుబ్బాక భాస్కర్, చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, పొట్ట శంకరయ్య, వీరమల్ల యాదయ్య, పల్లె శేఖర్ రెడ్డి, కొండూరు వెంకటేష్, బత్తుల సుధాకర్, ముత్యాల అంజయ్య, పల్లె మల్లారెడ్డి, ముత్యాలు, బైకని రాజు, పందుల యాదగిరి ,సుధాకర్, గాలయ్య, రామ్ రెడ్డి, సిరిపంగి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు



# శ్రీ శ్రీనివాస కాలనీ డ్రైనేజీ సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలి

## – కాలనీ సమస్యలపై కార్పొరేటర్ జీవన్ రెడ్డిని కలిసిన కాలనీ కమిటీ నాయకులు

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 12హయత్ నగర్ శ్రీ శ్రీనివాస కాలనీ డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ జీవన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలోని సమస్యలను కార్పొరేటర్ కు వివరించారు శ్రీ శ్రీనివాస కాలనీ కమిటీ నాయకులు కాలనీ అధ్యక్షులు పైళ్ళ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మా కాలనీలో డ్రైనేజీ యానిమల్స్ మొత్తం పొంగిపొర్లుతున్నాయని. పైప్ లైన్ పగిలిపోయి కోతకు గురైందని, కాలనీ సమస్యల పరిష్కారం కై దృష్టి సారించాలని కార్పొరేటర్ జీవన్ రెడ్డి కి తెలిపారు. తక్షణమే స్పందించిన కార్పొరేటర్ జీవన్ రెడ్డి అధికారులతో ఫోన్లో మాట్లాడి రేపు పనులు మొదలు పెడతామని హామీ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీనివాస కాలనీ కమిటీ నాయకులు ధర్మ రెడ్డి, కృష్ణ, శ్రీశైలం, నరసింహ, రాములు, తదితరులు పాల్గొన్నారు



# శ్రీ మార్కండేశ్వర దేవాలయ నూతన కార్యవర్గము

సంస్థాన్ నారాయణపూర్ సెప్టెంబర్ 12 :( వార్త మిర్రర్ )

నారాయణ పూర్ మండల కేంద్రంలో శ్రీ మార్కండేశ్వర దేవాలయ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా సురేపల్లి కుచేలు, ఉపాధ్యక్షులుగా చెరిపల్లి లక్ష్మయ్య, మిర్యాల రాజరత్నం, ప్రధాన కార్యదర్శిగా గుర్రం వెంకటేశం, కోశాధికారిగా ఎలె నరసింహ్, సహాయ కార్యదర్శిగా చిలుకూరి శ్రీనివాస్,ప్రచార కార్యదర్శి లు గా మాకం శ్రీనివాస్,కర్నాటి నవీన్ లు కార్యవర్గ సభ్యులుగా,మాకం యాదగిరి,పున్న విజయ్,గంజి రాములు, దోర్నాల అంజయ్య, మాకం రామకృష్ణ, సురేపల్లి రాములు, సురేపల్లి జవహర్, సింగం భాస్కర్, లు ఎన్నికయ్యారు.



# వినాయక మండపాలలో లలిత పారాయణం.

మందమర్రి సెప్టెంబర్ 12: వార్త మిర్రర్ ప్రతినిధి

పట్టణంలోని వివిధ వార్డుల్లో,కాలనీలలో ప్రతిష్టించిన వినాయక మండపాలలో ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి వేడుకలను నిర్వహిస్తున్నారు.గురువారం పలు మండపాలలో మహిళలు లలితా పారాయణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ లలిత పారాయణం నిర్వహించడం వల్ల అమ్మవారి అనుగ్రహ శక్తి కలుగుతుందని అన్నారు. ప్రతి మహిళ తప్పకుండా లలిత పారాయణం ప్రతి రోజు చేయాలని వారు సూచించారు ఈ కార్యక్రమంలో మహిళలు ఆయా కాలనీల వాసులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే మర్రి



## అర్హులందరికీ రుణమాఫీ సర్వే ద్వారా వివరాలను సమర్పించాం రైతులు అధైర్య పడవద్దు

### వ్యవసాయ శాఖ ఏడీఏ దేవ్ సింగ్ నాయక్

మిర్యాలగూడ , సెప్టెంబర్ 12:-( వార్త మిర్రర్) రైతు ఋణమాఫీ అర్హులందరికీ అందుతుందని, అధైర్య పడవద్దని మిర్యాలగూడ వ్యవసాయ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ బి. దేవ్ సింగ్ నాయక్ తెలిపారు. గురువారం మిర్యాలగూడ మండలం రాయానిపాలెం, జాలుబాయితండాలో ఋణమాఫీ సర్వేను పర్యవేక్షించిన అనంతరం రైతులతో మాట్లాడుతూ రైతులు సర్వేకు సహకరించాలని అడిగిన వివరాలు సమర్పిస్తే వెంటనే ఋణమాఫీ జరుగుతుందని ఆయన తెలిపారు. కొంతమంది రైతులకు వెంటనే మాఫీ పత్రాలను ఆయన అందజేశారు. ఖరీఫ్ సీజన్ వరి, తదితర పంటలపై చీడ పీడలు ఆశిస్తే వెంటనే వ్యవసాయ విస్తరణ అధికారులకు తెలియజేసి వారు సిఫార్సు చేసిన క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలని కోరారు. వరిపంటపై యూరియా అధికంగా వాడటం వల్ల సల్ల తెగుళ్లు ఆశించే ప్రమాదముందని ఆయన తెలిపారు. యూరియా తక్కువగా వాడాలని సలహా ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవాయాధికారి డీ. సైదానాయక్, ఏఈఓ ఆఫ్రీన్, రైతులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ నరేష్ విఆర్ కు అటాచ్



మిర్యాలగూడ, సెప్టెంబర్ 12:-( వార్త మిర్రర్)

మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కె.నరేష్ ను విఆర్ కు అటాచ్ చేస్తూ గురువారం జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై అనేక అవినీతి, అక్రమాల ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టిన పోలీస్ ఉన్నతాధికారులు ఆరోపణలు రుజువు కావడంతో ఎస్ఐ కె.నరేష్ ను విఆర్ కు అటాచ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీచేశారు. కానిస్టేబుల్ బిటి నాయక్ ను చింతపల్లికి బదిలీ చేశారు. త్వరలో మిర్యాలగూడ రూరల్ స్టేషన్ కు కొత్త ఎస్ఐ రానున్నారు.



## అంగన్వాడి పిల్లలకు చదవడం రాయడం నేర్పారు

మిర్యాలగూడ , సెప్టెంబర్ 12:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ ఐసీడిఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో పోషణమాసం కార్యక్రమం సీడీపీఓ ఆర్.మమత ఆధ్వర్యంలో ఎన్ఎస్పి క్యాంపు సెక్టార్ అశోకునగర్ అంగన్వాడీ కేంద్రంలో పోషణమాసం కార్యక్రమంలో భాగంగా గురువారం షెడ్యూల్ ప్రకారంగా ఉపాధ్యాయులు హావభావాలతో స్వర మార్పులతో కథ చెప్పడం. పిల్లలు సొంతంగా రాయడం, అక్షరాలను గుర్తించడం, పెన్సిల్ పట్టుకోవడం నిర్వహించారు. సూపర్వైజర్ ఎం.లీలాకుమారి 3-6 సంవత్సరాల పిల్లలకు కథల పుస్తకాలు ఇచ్చి చిత్రాల సహాయంతో, ప్లాష్ కార్డ్స్ తో బొమ్మలు చూపిస్తూ కథ చెప్పారు. అదే విధంగా గర్భిణీ, బాలింతలకు రక్తహీనత, పౌష్టికాహర ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు అంగన్వాడీ కేంద్రాలలో లభించే పౌష్టికాహార పదార్థాలను గురించి వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్నవారు సూపర్వైజర్ లీలాకుమారి, అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, గీత, జ్యోతి, షబానాబేగం, హెల్పర్ విజయలక్ష్మి, ఆశావర్కర్ రాణి, రాజేశ్వరి, లబ్దిదారులు, పాల్గొన్నారు.



## మిర్యాలగూడతో సీతారాం ఏచూరికి ఉన్న అనుబంధం

మిర్యాలగూడ , సెప్టెంబర్ 12:-( వార్త మిర్రర్) సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి కి మిర్యాలగూడతో అనుబంధం ఉన్నది. మిర్యాలగూడకు అనేకసార్లు జాతీయ ప్రధాన కార్యదర్శి హెూదాలో వచ్చారు. 2003లో డిసెంబర్ 1న సిపిఎం మిర్యాలగూడ డివిజన్ కార్యాలయం ఆయనే ప్రారంభించారు. 2004, 2009, 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికలలో సిపిఎం అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి గెలుపు కోరుతూ ప్రచారంలో పాల్గొన్నారు. 2022 సెప్టెంబర్ 17న మిర్యాలగూడలో జరిగిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా హాజరైయ్యారు. అనేక కార్యక్రమాలలో సీతారా%శీ% ఏచూరి హాజరయ్యారు. ఆయనకు మిర్యాలగూడ కార్యకర్తలతో మంచి అనుబంధ ఉంది. ఆయన మృతి పట్ల కార్యకర్తలు సంతాపం తెలిపారు. గతంలో ఆయనతో దిగిన ఫోటోలను స్టేటస్ లో పెట్టుకొని సంతాపం తెలుపుతున్నారు. ప్రభుత్వ విధానాలపై మిర్యాలగూడ క్లబ్ లో 1988లో జరిగిన సెమినార్ లో ముఖ్యవక్తగా ఏచూరి కాగా తానూ అధ్యక్షత వహించిన విషయాన్ని జర్నలిస్టు ఖాజాహమీదుద్దిన్ గుర్తు చేశారు. ఆయన జర్నలిస్టుగా చేసిన సేవలను గుర్తు చేసుకుంటు నివాళులర్పించారు.

### అరుంధతి ఆసుపత్రికి మల్కాజ్గిరి నుండి ఉచిత అంబులెన్స్ వాహనం సౌకర్యం

వార్త మిర్రర్ ,మల్కాజిగిరి:గత ఎమ్మెల్యే ఎన్నికల్లో మల్కాజ్గిరి నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారీగా నెరవేర్చేందుకు మల్కాజ్గిరి ఎమ్మెల్యే మరి రాజశేఖర్ రెడ్డి ప్రణాళిక సిద్ధం చేసినట్లు గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ నీరుగొండ జగదీష్ గౌడ్ పేర్కొన్నారు. మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి దుండిగల్ లో ఉన్న అరుంధతి హాస్పిటల్ వరకు ప్రవేశపెట్టిన ఉచిత అంబులెన్స్ సర్వీస్ ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఎన్నికల సమయంలో మల్కాజ్గిరి ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చారన్నారు. దుండిగల్ లో ఉన్న అరుంధతి హాస్పిటల్కు సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో మల్కాజిగిరి ప్రజలు అక్కడికి వెళ్లి ఉచితంగా వైద్య సేవలు చేయించుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఆగస్టు 15వ తేదీ స్వతంత్ర దినోత్సవం రోజు మల్కాజిగిరి ప్రజల కోసం ఉచితంగా అంబులెన్స్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. అందుకోసం మల్కాజ్గిరి ప్రజల కోసం వారంలో నాలుగు రోజులు మల్కాజ్గిరి నుండి అరుంధతి హాస్పిటల్ కు వెళ్లడానికి అంబులెన్స్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా రెండు రూట్లుగా రూట్ మ్యాప్ ను వారు గురువారం విడుదల చేశారు.మల్కాజ్గిరి నుంచి అరుంధతి హాస్పిటల్ కు అంబులెన్స్ వెళ్లే రూట్ మ్యాప్ వివరాలుసోమవారం ఉదయం 8 గంటలకు మల్కాజ్గిరి గాంధీ పార్క్ గాంధీ పార్క్, 8.15 కి మల్కాజ్గిరి ఎక్స్ రోడ్, 8:30 పోలీస్ స్టేషన్ రోడ్డు మీదుగా 8:30 కి ఎస్పీ నగర్ ,9 గంటలకి ఉప్పరిగూడ, 9.15 గంటలకు ఆర్టీసీ కాలనీ, 9:30 కి మౌలాలి కమాన్, 9. 45 కి సంతోషిమా నగర్ ,10 గంటలకు కాకతీయ నగర్, 10:15 పోలీస్ కమిషనరేట్ కార్యాలయము వాయుపురి, 10.30 కి జీకే కాలనీ, 10:45 కి ఆర్కేపురం ఆశా ఆఫీసర్స్ కాలనీ, 11 గంటలకు భవాన్స్ కళాశాల, 11 .15 నిమిషాలకు యాప్రాల్ బస్టాండ్, 11:30 కు కౌకూర్, 11 45 నిమిషాలకు బటన్ తుర్కపల్లి మీదుగా



దుండిగల్ లో ఉన్న అరుంధతి హాస్పిటల్ కు రోగులను ఎక్కించుకొని తీసుకు వెళుతుందన్నారు సాధ్యమైనంత తొందరగా అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం తిరిగి మళ్లీ ఎవరిని ఎక్కడ ఎక్కించుకున్న స్థానాల్లో వారిని అంబులెన్స్ దించుకుంటూ వెళ్తుందని తెలిపారు. ,మంగళవారం, శుక్రవారం8 గంటలకు సాయి నగర్ చౌరస్తాలోని షికారి మల్లయ్య గార్డెన్, 8.15 గంటలకు ఇందిరా నెహ్రూ నగర్, 8.30 గంటలకు దయానందనగర్, 8.45 గంటలకు ఆనంద్ బాగ్ ఎక్స్ రోడ్, 9 గంటలకు కృపా కాంప్లెక్స్, 9:15 నిమిషాలకు వినాయక్ నగర్ ఎక్స్ రోడ్, 9:30 కు ఓల్డ్ పోలీస్ స్టేషన్ నేరేడ్మెట్, 9:45 నిమిషాలకు నేరేడ్మెట్ జీకే కాలనీ సికింద్రాబాద్ సెంట్రల్, 10 గంటలకు ఆర్కేపురం బ్రిడ్జి ఆశా ఆఫీసర్స్ కాలనీ, 10.15 గంటలకు అల్వాల్ ఎక్స్ రోడ్, 10.30 ఓల్డ్ ఆల్వాల్, 10.45 గంటలకు ఇందిరాగాంధీ విగ్రహం, 11 గంటలకు అంబేద్కర్ నగర్ మరియు శివనగర్ మీదుగా 11 .10 నిమిషాలకు అరుంధతి హాస్పిటల్ కి చేరుకుంటుందన్నారు. ఈ అవకాశాన్ని మల్కాజిగిరి సర్కిల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రాము యాదవ్ , జీకే హనుమంతరావు, భాగ్యానందరావు, ఉపేందర్ రెడ్డి, తుపాకుల జనార్ధన్, సిద్ధి రాములు, శ్రీరాములు యాదవ్ పాల్గొన్నారు.



## ఆధ్యాత్మికతకు శాంతినగర్ కాలనీ శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ప్రత్యేకం

### - పూజలో పాల్గొన్న శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులు

హయత్ నగర్ వార్త మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 12హయత్ నగర్ బస్ డిపో రోడ్డు శాంతినగర్ కాలనీ లో శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన మహా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులు. ఈ సందర్భంగా శివానంద్ సాగర్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తే కాలనీ ప్రజల్లో స్నేహ భావం పెంపొందించొచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ సభ్యులు జస్వంత్ రెడ్డి, శివానంద సాగర్,,అజయ్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, రక్షిత్ రెడ్డి ,మణికంఠ గౌడ్, సాయి తేజ ,అజయ్ గౌడ్ ,భారత్ రెడ్డి, సాయి వర్ధన్ ,అజయ్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ పూజా కార్యక్రమానికి శాంతినగర్ కాలనీ ప్రజలు, మహిళలు, చిన్నారులు అధిక సంఖ్యలో తీర్థప్రసాదాలు స్వీకరించి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు



## బైక్ ని ఢీ కొట్టిన లారీ ఒకరు మృతి

వార్త మిర్రర్ ప్రతినిధి మల్లాపూర్ సెప్టెంబర్ 12 :

మల్లాపూర్ మండలం మొగిలిపేట గ్రామానికి చెందిన రాణవేణి చిన్న లింబన్న (60) తండ్రి లింబన్న ప్రక్కన వ్యవసాయ భూమి ఉన్న మల్యాల లింగు భర్త నర్సయ్య ఇద్దరూ టీవీఎస్ ఎక్సెల్ బైక్ పై తోట దగ్గరకు చిలకల కావాలి కొరకు బయలుదేరి వెళ్తుండగా ఎదురుగా ఖానాపూర్ నుండి మెట్పల్లి వెళ్తున్న లారీ దాని డ్రైవర్ సయ్యద్ ముస్తాక్ తండ్రి సయ్యద్ హమీద్ మహారాష్ట్రకు చెందిన వ్యక్తి తన లారీని అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఎక్సెల్ బండికి టక్కరి ఇవ్వగా చిన్న లింబన్న అక్కడికక్కడే మృతి చెందగా మల్యాల లింగుకు తీవ్ర గాయాలు కాగా ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు చిన్న లింబన్న భార్య రాజగంగు ఫిర్యాదు మేరకు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనది



## అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

వార్త మిర్రర్ ప్రతినిధి మల్లాపూర్ సెప్టెంబర్ 12 :

మల్లాపూర్ మండల కేంద్రంలోని దుర్గమ్మ టెంపుల్ దగ్గర గల శనిగారపు రాజేందర్ షెడ్ లో అక్రమంగా పిడిఎస్ రేషన్ బియ్యం నిల్వ వుంచినారని నమ్మదగిన సమాచారం మేరకు సీఐ మెట్పల్లి నిరంజన్ రెడ్డి, ఎస్సై మల్లాపూర్ కిరణ్ కుమార్ వారి సిబ్బంది తో కలిసి దాడి చేయగా అక్కడ అక్రమంగా నిల్వ ఉంచిన పిడిఎస్ బియ్యం 20 బస్తాలు సుమారు 10 క్వింటాలు స్వాధీన పరచుకొని నిల్వ ఉంచిన ఆకుల శ్రీకాంత్,పస్తం రాజేష్ లను అదుపులోకి తీసుకొని విచారించగా ఖనాపూర్ కి చెందిన ప్రభాకర్ అనే వ్యక్తి కి అమ్ముతున్నాం అని తెలుపగా వారి ముగ్గురు పై కేసు నమోదు చేయనైనది.కావున ఎవరు కూడా పిడిఎస్ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించినట్లయితే వారి మీద కఠినమైన చర్యలు తీసుకోబడునని సీఐ మెట్పల్లి, ఎస్సై మల్లాపూర్ తెలిపినారు

## వక్ఫ్ సవరణలచట్టాన్ని కేంద్రం ఉపసహరించుకోవాలి

### - కాంగ్రెస్ పార్టీ మునుగోడునియోజకవర్గం మైనార్టీ నాయకుడు యండి. రహీం షరీఫ్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి సెప్టెంబర్ 12

సంస్థాన్ నారాయణపురం మండలంకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మునుగోడు నియోజకవర్గం మైనార్టీ నాయకుడు యండి రహీంషరీఫ్.మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతీసుకువచ్చిన వక్ఫ్స వరణలచట్టం రాజ్యాంగవ్యతిరేకమని మతస్వేచ్ఛలో జోక్యంకలిగిస్తుదివక్ఫ్ బోర్డు స్వతంత్రను దెబ్బ తీస్తుందిఅనిఅన్నారు ఈచట్టం మైనార్టీలకు రాజ్యాంగంకల్పించిన హక్కుల నుకాల రాస్తుందని అందుకే కేంద్ర ప్రభుత్వంఈచట్టాన్నివెంటనే ఉపసంహరించు కోవాలని కేంద్ర ప్రభుత్వని డిమాండ్ చేశారు




## సీఎన్జీ కారు కొంటున్నారా..? ఈ టిప్స్ పాటించకపోతే ఇక అంతే

ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు అనూహ్యంగా పెరగడంతో ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే వాహనాలను ప్రజలు అమితంగా ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా ఇటీవల ఎలక్ట్రిక్ వాహనాలను ఇష్టపడుతున్నా భారతదేశంలో మాత్రం సీఎన్జీతో నడిచే వాహనాలకు డిమాండ్ పెరిగింది. సీఎన్జీ అనేది పర్యావరణ అనుకూలమైన, తక్కువ ఖర్చుతో లభించే ఇంధనం. ముఖ్యంగా కారు కొనుగోలుదారులు సీఎన్జీ వాహనాలను ఇష్టపడుతూ ఉంటారు. సీఎన్జీ ఆధారిత కార్లు మెరుగైన మైలేజీని అందించడమే కాకుండా ఇంధన ఖర్చులను ఆదా చేయడంలో సహాయపడతాయి. ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు అనూహ్యంగా పెరగడంతో ప్రత్యామ్నాయ ఇంధనాలతో నడిచే వాహనాలను ప్రజలు అమితంగా ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా ఇటీవల ఎలక్ట్రిక్ వాహనాలను ఇష్టపడుతున్నా భారతదేశంలో మాత్రం సీఎన్జీతో నడిచే వాహనాలకు డిమాండ్ పెరిగింది. సీఎన్జీ అనేది పర్యావరణ అనుకూలమైన, తక్కువ ఖర్చుతో లభించే ఇంధనం. ముఖ్యంగా కారు కొనుగోలుదారులు సీఎన్జీ వాహనాలను ఇష్టపడుతూ ఉంటారు. సీఎన్జీ ఆధారిత కార్లు మెరుగైన మైలేజీని అందించడమే కాకుండా ఇంధన ఖర్చులను ఆదా చేయడంలో సహాయపడతాయి. ఈ హైబ్రిడ్ కార్లు పెట్రోల్, సీఎన్జీ రెండు ఇంధనాలతో నడుస్తాయి. పెట్రోల్ లేదా డీజిల్ వాహనాలతో పోలిస్తే ఇవి చాలా తక్కువ కాలుష్యాన్ని విడుదల చేస్తాయి. అయితే సీఎన్జీ కారు నిర్వహణ విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని నిపుణులు చెబుతున్నారు. సీఎన్జీ సిలిండర్ లేదా ఇంధన లైన్ నుండి ఒక చిన్న లీక్ కూడా తీవ్రమైన ప్రమాదాలకు దారి తీస్తుంది. కాబట్టి సీఎన్జీ కార్లను నిర్వహించడం చాలా కీలకం. ఈ నేపథ్యంలో సీఎన్జీ కార్ల నిర్వహణలో నిపుణులు తెలిపే టిప్స్‌ను ఓ సారి తెలుసుకుందాం. నీడలో పార్క్ చేయడం మీ సీఎన్జీ కారును నీడ ఉన్న ప్రదేశంలో లేదా గ్యారేజీలో పార్కింగ్ చేయడం చాలా ముఖ్యం. ప్రత్యక్ష సూర్యకాంతికి ఎక్కువసేపు గురికాకుండా ఉంచితే ప్రమాదాలను నివారించవచ్చు. ఎందుకంటే మండే వేడి సీఎన్జీ ట్యాంక్ జీవితకాలాన్ని ప్రభావితం చేస్తుంది. అలాగే క్యాబిన్ ఉష్ణోగ్రతను పెంచుతుంది. స్పార్క్ ప్లగ్‌ల తనిఖీ మీ కారు ఇంజిన్‌లోని దహన ప్రక్రియకు స్పార్క్ ప్లగ్‌లు చాలా ముఖ్యమైనవి. వాటిని క్రమం తప్పకుండా తనిఖీ చేయడంతో పాటు అవసరమైనప్పుడు వాటిని భర్తీ చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. మీ వాహనం కోసం స్పార్క్ ప్లగ్‌లను ఎంచుకున్నప్పుడు మీరు ఎల్లప్పుడూ అధిక-నాణ్యత, సీఎన్జీ-అనుకూలమైన, అమర్చిన సీఎన్జీ స్పార్క్ ప్లగ్‌ని ఎంచుకోవాలి. అలాగే ప్రతి 10,000 కిమీ లేదా ఆరు నెలలకోసారి దాన్ని మార్చుకోవాలి.థొరెటల్ బాడీ ఎయిర్ ఫిల్టర్‌ను ఇన్‌టేక్ మానిఫోల్డ్‌కి కలుపుతుంది. డర్టీ థొరెటల్ బాడీ ఇంజిన్ పనితీరును ప్రభావితం చేస్తుంది. దహన సమయంలో గాలిని మృదువుగా తీసుకోవాలంటే దాన్ని క్రమం తప్పకుండా శుభ్రం చేయాలి. సీఎన్జీ ట్యాంక్ తనిఖీ భద్రత కోసం అధీకృత సేవా సౌకర్యం ద్వారా సీఎన్జీ ట్యాంక్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం తప్పనిసరి. నష్టాలు, తుప్పు, పగుళ్ల ఏమైనా ఉన్నాయో? ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం ఉత్తమం. ముఖ్యంగా ట్యాంక్ గడువు తేదీని ఎల్లప్పుడూ ధ్రువీకరించుకోవాలి. అవసరమైన విధంగా దాన్ని భర్తీ చేయాలి.